RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైలీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18
సంచిక : 168
Vol : 18
Issue : 168

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, ఆదివారం 30 ఆగస్టు 2026
Warangal, Sunday 30 August 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts



WANTED
పీపుల్స్‌డైలీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859


- కేసీఆర్ టీం వ్యూహాత్మక అడుగులు...
- వచ్చేసారి నేనే సీఎం అంటూ రేవంత్ తరచూ వ్యాఖ్యలు
- రేవంత్‌రెడ్డి కామెంట్స్‌లో బీఆర్ఎస్ అలర్ట్...
- సమస్యలపై వరుస పోరాటాలకు గులాబీ రెడీ
- నిత్యం ప్రజల దృష్టిలో ఉండటమే లక్ష్యం
- కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రచారం...

# గర్జన పెంచిన గులాబీ




2వ పేజీలో..

# ఏపీకి కాసుల పంట!




- దేశంలోనే తొలి భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్ట్..
- రూ.65 వేల కోట్ల రాబడికి చాన్స్
- వేలాదిమంది ఉపాధి అవకాశాలు
- 2030 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి

**పీపుల్స్‌డైరీ-అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి కాసుల పంట పండబోతుంది. ఏలూరు జిల్లా చింతలపూడి, రేచెర్లలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్ట్ ఏపీకి భారీ ఆదాయాన్ని ఇవ్వబోతోంది. దేశంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్ట్‌గా ఏపీలో రిలయన్స్ చేపడుతున్న భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్ట్ నిలవనుంది. దీని ద్వారా గనుల శాఖకు రూ.65 వేల కోట్ల రాబడి రానుంది. ప్రత్యక్షంగా 3,500 నుంచి 5 వేల మందికి, పరోక్షంగా 20 నుంచి 35 వేల మందికి ఉపాధి లభించనుంది. రూ.2.73 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్ట్‌లో చింతలపూడిలో 1,200 హెక్టార్లు, రేచెర్లలో 2,225 హెక్టార్ల బొగ్గు గనులు ఉన్నాయి. రెండు బ్లాకుల్లో కలిపి 1.5 (మిగతా 2లో...)

## తలెత్తుతున్న నల్లటి ప్రశ్నలు..

# లెక్కల్లో గోల్‌మాల్?




నల్ల బొగ్గు మీద తెల్ల కాగితాల్లో లెక్కలు.. ఒక కాగితంలో ఒక బరువు.. మరో కాగితంలో మరో బరువు.. లారీ చక్రాలు తిరుగుతున్నాయి.. తూకం యంత్రాలు లెక్కిస్తున్నాయి.. బిల్లులు చేతులు మారుతున్నాయి.. కానీ.. లెక్కల్లో మాత్రం ఏదో మాయమవుతోంది! ఆర్టీఐ కాగితం చెబుతోంది.. 29.61 టన్నులే సరుకు బరువు.. అధికారుల మాట చెబుతోంది.. "అధిక లోడింగ్ జరగడం లేదు" అని.. కానీ.. ఒక పన్ను బిల్లు తెరచి చూస్తే.. అందులో కనిపించింది 32.320 టన్నుల బొగ్గు! లెక్కల మధ్యలో 2.710 టన్నుల నల్లటి ప్రశ్న! ఆ రెండు టన్నులకు పైగా బొగ్గు గాలిలో కలిసిపోయిందా? తూకం యంత్రం తప్పు చెప్పిందా..? బిల్లు లెక్క మారిందా..? లేదా.. లోడింగ్ విధానంలో మనకు తెలియని నిబంధన ఏదైనా ఉందా..? ప్రశ్న అడిగితే సమాధానం కావాలి.. లెక్క చూపితే ఆ లెక్కకు ఆధారం కావాలి.. అక్రమాలు జరుగుతున్నాయని జనం సందేహాలు... మరి అధికారుల సమాధానం కోసం వేచిచూద్దాం...

పీపుల్స్‌డైరీ-మణుగూరు

- సింగరేణి బొగ్గు లెక్కల్లో సంచలన వైరుధ్యం
- బొగ్గు రవాణాలో బరువు లెక్కలపై అనేక ప్రశ్నలు
- సమాచార హక్కు సమాధానంతో బిల్లుకు పొంతనేదీ?
- 29.61 టన్నులకే అనుమతి.. బిల్లులో 32.320 టన్నులు!
- భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు రవాణాపై కలకలం
- పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయా?
- అధికారులు స్పష్టనివ్వాలంటూ డిమాండ్లు...

2వ పేజీలో..

# భారత్‌లోకి చొరబడిన పాక్ డ్రోన్..

## రాత్రికి రాత్రే హై అలర్ట్!

పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : భారత సరిహద్దుల్లో అలజడి సృష్టించేందుకు పాకిస్తాన్ మళ్లీ కుట్రలకు తెరలేపింది. జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంట శత్రు దేశం నుంచి వచ్చిన డ్రోన్ ఒకటి ప్రత్యక్షం కావడంతో సరిహద్దులో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. పూంచ్ జిల్లా సరిహద్దుల్లో ఈ సస్పెక్టెడ్ డ్రోన్ కదలికలు కనిపించడంతో మన రక్షణ దళాలు తక్షణమే అప్రమత్తమయ్యాయి. సరిహద్దుల్లోని ఆర్మీ బలగాలు రాత్రికి రాత్రే అదనపు నిఘాను ఏర్పాటు చేసి, సరిహద్దు ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. శుక్రవారం రాత్రి 8:05 గంటల సమయంలో పాకిస్తాన్ వైపు నుంచి వచ్చిన ఒక అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్ భారత భూభాగంలోకి ప్రవేశించినట్లు ఆర్మీ అధికారులు గుర్తించారు. 22 జమ్మూ కాశ్మీర్ రైఫిల్స్ పర్యవేక్షణలో ఉండే పూంచ్ జిల్లా మెంధార్ సెక్టార్‌లోని బెహ్రూటీ గ్రామంపై (మిగతా 2లో...)



# వేపచెట్టు విషయంలో వివాదం

- గొడవల్లో ఇద్దరు మృతి

**పీపుల్స్‌డైరీ-మేళ్లచెరువు(సూర్యాపేట) :** వేపచెట్టు విషయంలో జరిగిన ఘర్షణ తీవ్ర విషాదానికి దారితీసింది. ఇంటి సరిహద్దులో ఉన్న వేపచెట్టు విషయంలో రెండు కుటుంబాల మధ్య సుమారు 25 ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే చెట్టు కొమ్మలు నరికే విషయంలో మరోసారి రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకోగా వెంకటేశ్వర్లుపై రాము గొడ్డలితో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత తన తండ్రి సైదాపై కూడా రాము దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో ఇద్దరూ మృతి చెందారు. ఘటన తర్వాత రాము ఇంటిపై స్థానికులు రాళ్లదాడి చేయగా ఎస్ఐకి గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే....

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగట్టు తండాలో శనివారం చోటుచేసుకున్న డబుల్ మర్డర్ తీవ్ర కలకలం (మిగతా 2లో...)

# హైదరాబాద్ మెట్రో సేవల్లో అంతరాయం..

- పనిచేయని సెన్సార్లు
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన ప్రయాణికులు

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** హైదరాబాద్ నగరవాసులకు అత్యంత కీలకమైన మెట్రో రైలు సేవల్లో శనివారం ఉదయం తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరీ ముఖ్యంగా ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులకు స్టేషన్ల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మెట్రో స్టేషన్లలోని ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద సెన్సార్లు పనిచేయకపోవడంతో ప్రయాణికులు క్యూలలో నిలిచిపోవాల్సి వచ్చింది. ఆన్‌లైన్‌లో ముందుగానే (మిగతా 2లో...)



# ఫుడ్ ప్యాకెట్లపై ఇకపై రెడ్ మార్క్

## కొత్త రూల్స్... త్వరలోనే నూతన చట్టం?

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** మీరు రోజూ తినే చిప్స్, బిస్కెట్లు, చాక్లెట్లు, కూల్ డ్రింక్స్ ప్యాకెట్లపై త్వరలోనే ఎరుపు రంగు ప్రమాద హెచ్చరికలు కనిపిస్తాయి. మనదేశంలో తినుబండారాల నాణ్యతను పర్యవేక్షించే 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా'- ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్యాకేజ్డ్ ఫుడ్‌పై సరికొత్త బాంబు పేల్చింది. పరిమితికి మించిన చెక్కర, ఉప్పు, కొవ్వు పదార్థాలు ఉన్న ఆహార పదార్థాల ప్యాకెట్ల ముందు భాగంలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా రెడ్ కలర్ వార్నింగ్ లేబుళ్లను తప్పనిసరి చేయాలని ప్రతిపాదించింది. వినియోగదారులు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడానికే ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతున్నారు. (మిగతా 2వ పేజీలో...)



# గర్జన పెంచిన గులాబీ...

- కేసీఆర్ టీం వ్యూహాత్మక అడుగులు...
- వచ్చేసారి నేనే సీఎం అంటూ రేవంత్ తరచూ వ్యాఖ్యలు
- రేవంత్‌రెడ్డి కామెంట్స్‌లో బీఆర్ఎస్ అలర్ట్...
- సమస్యలపై వరుస పోరాటాలకు గులాబీ రెడీ
- నిత్యం ప్రజల దృష్టిలో ఉండటమే లక్ష్యం
- కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రచారం...

వల్లంపట్ల క్రిష్ణాకర్
నెట్‌వర్క్ ఇన్‌చార్జి :

ఇన్నాళ్లు ప్రభుత్వంపై పెద్దగా ప్రత్యక్ష పోరాటాలకు దిగని గులాబీ పార్టీ ఇప్పుడు ప్రజా సమస్యలను అస్త్రాలుగా మలుచుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహానికి శ్రీకారం చుట్టినట్లు కనిపిస్తోంది. పార్టీ నేతలకు వరుస ప్రజా పోరాటాలపై దిశానిర్దేశం చేయడంతో పాటు, ఆందోళనల కార్యాచరణను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో వచ్చేసారి మళ్లీ నేనే సీఎం అంటూ రేవంత్‌రెడ్డి తరచూ చేస్తున్న వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీని అలర్ట్ చేస్తున్నాయి. అదేగనుక జరిగితే బీఆర్ఎస్‌కి మరికొన్నేండ్లు అధికారం దూరమయ్యే పరిస్థితి ఎదురవుతుందనే ఆందోళనతో బీఆర్ఎస్ టీం వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్లు అవగతమవుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లడం, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించడం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను యాక్టివ్ చేయడం ద్వారా బీఆర్ఎస్‌కు మళ్లీ ప్రజల్లో పట్టు పెంచాలన్నది కేసీఆర్ టీం వ్యూహంగా కనిపిస్తోంది.

ముఖ్యంగా ఇటీవలి కాలంలో తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ వేడి పెరుగుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీలు తమ రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిన రాష్ట్ర రాజకీయాల్లో.. త్వరలో జరగనున్న గ్రేటర్ ఎన్నికలు మూడు ప్రధాన పార్టీలకు కీలక పరీక్షగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా వేగం పెంచడం ఆసక్తికరంగా మారింది.

**అధికార పార్టీలో అసంతృప్తులపై గురి?**

ఇక రాజకీయంగా మరో కీలక వ్యూహానికి కూడా గులాబీ పార్టీ పదును పెడుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీలోని అసంతృప్త నేతలను గులాబీ వైపు తిప్పుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా చేరికలను ప్రోత్సహించడం వల్ల గులాబీ పార్టీలో కొత్త ఉత్సాహం రేకెత్తడంతో పాటు కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళనలను సృష్టించవచ్చని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లోని సీనియర్ నేతలపై బీఆర్ఎస్ పార్టీ దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కొందరు సీనియర్ నేతలతో బీఆర్ఎస్ ముఖ్యులు టచ్‌లో ఉన్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. కాంగ్రెస్‌లోని అసంతృప్తి నేతలను గుర్తించి.. వారిని తమ వైపు తిప్పుకోవడం ద్వారా ఒకవైపు పార్టీని బలోపేతం చేయడంతో పాటు, మరోవైపు అధికార కాంగ్రెస్‌కు రాజకీయంగా సవాల్ విసరాలన్నది గులాబీ వ్యూహంగా కనిపిస్తోంది.

మరోవైపు గ్రేటర్ ఎన్నికలను కూడా కేసీఆర్ అత్యంత కీలకంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పరిధిలో ప్రజలను నేరుగా ప్రభావితం చేస్తున్న సమస్యలపై ఆందోళనలు నిర్వహించడం ద్వారా బీఆర్ఎస్ కేడర్‌ను మళ్లీ జనంలోకి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. భూకబ్జాలు, 22-ఏ వివాదాలు, హైడ్రా కూల్చివేతలు వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఇప్పటికే బీఆర్ఎస్ నిరసనలకు దిగుతోంది. తాజాగా పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యను కూడా తన రాజకీయ అజెండాలోకి తీసుకొచ్చింది. విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తూ యువతలో పార్టీకి మద్దతు పెంచుకునే ప్రయత్నం చేస్తోంది.

**కేటీఆర్, హరీశ్‌రావులకు కీలక బాధ్యతలు**

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్‌రావు నిరంతరం ప్రజల్లోనే ఉండాలని కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వంపై విమర్శలు చేయడమే కాకుండా.. ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించాలన్నది పార్టీ నాయకత్వం నిర్ణయంగా కనిపిస్తోంది. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను లక్ష్యంగా చేసుకుని భారీ స్థాయిలో 'పోరుబాట'కు బీఆర్ఎస్ సిద్ధమవుతున్నట్లు స్పష్టమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త ప్రచారానికి సిద్ధమవుతోంది.

సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ఏవి అమలయ్యాయి? ఏవి ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి? ప్రజలకు ప్రభుత్వం ఏం బాకీ పడింది? అనే అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'బాకీ కార్డ్స్' ప్రచారాన్ని కూడా మళ్లీ తెరపైకి తీసుకొచ్చారు.

మొత్తంగా.. తెలంగాణలో ఎన్నికల సమరం ఇంకా అధికారికంగా మొదలుకాకపోయినా.. రాజకీయ పార్టీల వ్యూహాలు మాత్రం ఇప్పటి నుంచే వేడెక్కుతున్నాయి. రేవంత్ సర్కార్‌పై వరుస అస్త్రాలతో కేసీఆర్ పోరుబాటకు సిద్ధమవుతుండగా.. కాంగ్రెస్ ఈ దాడిని ఎలా ఎదుర్కొంటుంది? బీజేపీ ఎలాంటి వ్యూహంతో ముందుకొస్తుంది? అన్నది తెలంగాణ రాజకీయాల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**ఆత్మరక్షణలోకి కాంగ్రెస్ వెళ్తుందా?**

బీఆర్ఎస్ వ్యూహం వెనుక ప్రధాన లక్ష్యం ఒక్కటే.. ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై సమాధానం చెప్పే పరిస్థితిలోకి తీసుకురావడం. ఇప్పటివరకు అధికార కాంగ్రెస్ దూకుడును ఎదుర్కొన్న బీఆర్ఎస్.. ఇకపై రక్షణాత్మక ధోరణి నుంచి దూకుడైన రాజకీయ పోరాటానికి మారాలనే నిర్ణయానికి వచ్చినట్లు కనిపిస్తోంది.

ప్రజా సమస్యలు, హామీల అమలు, రైతులు, యువత, మహిళల అంశాలను అస్త్రాలుగా చేసుకుని ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడం.. మరోవైపు కాంగ్రెస్‌లోని అసంతృప్త నేతలను తమ వైపు తిప్పుకోవడం.. ఇంకోవైపు గ్రేటర్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా కేసీఆర్ ఒకేసారి మూడు వ్యూహాలను అమలు చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# లెక్కల్లో గోల్‌మాల్?

- సింగరేణి బొగ్గు లెక్కల్లో సంచలన వైరుధ్యం
- బొగ్గు రవాణాలో బరువు లెక్కలపై అనేక ప్రశ్నలు
- సమాచార హక్కు సమాధానంతో బిల్లుకు పొంతనేదీ?
- 29.61 టన్నులకే అనుమతి.. బిల్లులో 32.320 టన్నులు!
- భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు రవాణాపై కలకలం
- పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయా?
- అధికారులు స్పష్టనివ్వాలంటూ డిమాండ్లు...

**మణుగూరు, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ)** : సింగరేణి మణుగూరు ప్రాంతం నుంచి భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు జరుగుతున్న బొగ్గు రవాణాపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బొగ్గు రవాణా వాహనాల సామర్థ్యంపై సింగరేణి అధికారులు సమాచార హక్కు చట్టం ద్వారా ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో 29.61 మెట్రిక్ టన్నుల సరుకు బరువు మాత్రమే అనుమతించదగినదిగా పేర్కొనగా.. తాజాగా వెలుగులోకి వచ్చిన సింగరేణి పన్ను బిల్లులో 32.320 మెట్రిక్ టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు నమోదు కావడం కలకలం రేపుతోంది.

**సమాచార హక్కు సమాధానంలో అధికారులే చెప్పిన లెక్కలు ఇవే..**

2025 నవంబర్ 5 తేదీతో మణుగూరు ప్రాంత సింగరేణి అధికారులు ఇచ్చిన సమాచార హక్కు సమాధానంలో టీఎస్ 22టీ 2227 వాహనాన్ని ఉదాహరణగా తీసుకుని బొగ్గు లోడింగ్ వివరాలను వెల్లడించారు. వాహన నమోదు పత్రం ప్రకారం మొత్తం అనుమతించదగిన బరువు 42.00 టన్నులు కాగా 5 శాతం అనుమతించబడిన అదనపు పరిమితి - 2.10 టన్నులు. అదనపు పరిమితితో గరిష్ఠ మొత్తం బరువు - 44.10 టన్నులు. ఖాళీ వాహనం బరువు - 14.49 టన్నులు. అనుమతించదగిన సరుకు బరువు - 29.61 టన్నులు.


అంతేకాకుండా అదే సమాచార హక్కు సమాధానంలో "అధిక లోడింగ్ చేయడం లేదు" అంటూ ఎలాంటి అధిక లోడింగ్ జరగడం లేదని సింగరేణి అధికారులు స్పష్టం చేశారు. మరి 32.320 టన్నులు ఎలా వచ్చాయన్నది ప్రశ్నగా మిగులుతోంది.

2026 ఆగస్టు 26 తేదీతో ఉన్న సింగరేణి పన్ను బిల్లులో 32.320 మెట్రిక్ టన్నుల బొగ్గు నికర పరిమాణంగా నమోదు అయింది. సమాచార హక్కు సమాధానంలో చూపిన 29.61 టన్నుల సరుకు బరువుతో పోల్చితే 2.710 టన్నులు ఎక్కువగా ఉంది. ఇదే ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. 29.61 టన్నుల సరుకు బరువు మాత్రమే అనుమతించదగినదని సింగరేణి అధికారులు చెబుతున్నప్పుడు.. 32.320 టన్నుల బొగ్గు బిల్లులో ఎలా నమోదైంది? ఇది కేవలం సంఖ్యల తేడానా? లేక వాహనాల బరువు, ఖాళీ వాహనం బరువు, అనుమతించబడిన అదనపు పరిమితి, బొగ్గు లోడింగ్ విధానంలో ఏదైనా ప్రత్యేక నిబంధన ఉందా? అన్నది అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

ఒక్క బిల్లుతోనే అధిక లోడింగ్ నిర్ధారణ కాదు.. కానీ ప్రశ్నలకు మాత్రం కొదవలేదు.



THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
( A GOVERNMENT COMPANY )
TAX INVOICE
The S.C.Co. Ltd



The Singareni Collieries Company
(A Government Company)
Manuguru Area.

Ref.No. MNG/GM/15/1120 | Date: 05.11.2025.

PIO & DGM (Per).
Manuguru Area.

Sub: Seeking information under RTI Act - 2005 - Reg.
Ref: MNG/RTI PIO/2025/178, Date 09.10.2025

With reference to above, the coal loading of BTPS trucks has been reviewed on 12.10.2025 and the details of loading are as furnished below.

1. It is to inform that the coal is being loaded in BTPS trucks as per the carrying capacity of the trucks only, and no overloading is being done.

Example: Loading details of truck No. TS 22T 2227

| | |
|---|---|
| a) Gross weight of the truck as per RC book | 42.00 T |
| b) Permitted Tolerance @ 5% over gross weight | 02.10 T |
| c) Permitted gross weight considering tolerance (a+b) | 44.10 T |
| d) Weight of empty truck | 14.49 T |
| e) Permitted pay load in the truck (c-d) | 29.61T |

2. SCCL did not impose any conditions on BTPS coal transport contractors as the coal transport contracts are engaged by BTPS, but not by SCCL.

This is for your kind information and further necessary action.

SE (QM/MNG).

ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే.. సమాచార హక్కు సమాధానంలో ఉదాహరణగా పేర్కొన్న వాహనం టీఎస్ 22టీ 2227, బిల్లులో కనిపిస్తున్న వాహనం టీఎస్ 22టీ 2468గా ఉంది. కాబట్టి ఈ రెండు వాహనాలు ఒకటేనని చెప్పడం సాధ్యం కాదు.

అయితే సింగరేణి సమాచార హక్కు సమాధానంలో పేర్కొన్న 29.61 టన్నుల సరుకు బరువు లెక్కలతో, తాజాగా వెలుగులోకి వచ్చిన బిల్లులోని 32.320 టన్నుల పరిమాణాన్ని పోల్చి చూడాల్సిన అవసరం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

ముఖ్యంగా టీఎస్ 22టీ 2468 వాహనానికి సంబంధించిన నమోదు పత్రంలో మొత్తం అనుమతించదగిన బరువు ఎంత? ఖాళీ వాహనం బరువు ఎంత? అనుమతించదగిన సరుకు బరువు ఎంత? తూకం కేంద్రంలో నమోదైన మొత్తం బరువు, ఖాళీ వాహనం బరువు, నికర సరుకు బరువు ఎంత? అనే వివరాలు బయటకు వస్తే అసలు విషయం మరింత స్పష్టమవుతుంది.

**తూకం కేంద్రం రికార్డులు బయటపెడితే అసలు లెక్క తేలే అవకాశం**

బొగ్గు రవాణాపై ఉన్న అనుమానాలకు తెరపడాలంటే సంబంధిత వాహనాల తూకం రశీదులు, బొగ్గు పంపిణీ రికార్డులు, లోడింగ్ రికార్డులు, వాహన నమోదు పత్రాలు, సరుకు రవాణా పత్రాలు, పన్ను బిల్లులు, సరుకు అందజేత రికార్డులను అధికారులు పరిశీలించాల్సి ఉంది.

బిల్లులో నమోదైన 32.320 టన్నుల బొగ్గు నిజంగా తూకం కేంద్రంలో కూడా అదే పరిమాణంగా నమోదైందా? లేక బిల్లులో మాత్రమే ఆ పరిమాణం కనిపిస్తుందా? అన్నది కీలకంగా మారింది. అదే విధంగా.. ఒక్క వాహనం విషయంలోనే కాకుండా భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు తరలిస్తున్న అన్ని వాహనాల గత కొన్ని నెలల లోడింగ్, తూకం కేంద్రం, బిల్లుల రికార్డులను అధికారులు తనిఖీ చేస్తే వాస్తవ పరిస్థితి బయటపడే అవకాశం ఉంది.

**అధికారులు స్పష్టత ఇవ్వాలి**

ఒకవైపు సమాచార హక్కు సమాధానంలో "అధిక లోడింగ్ జరగడం లేదు" అని స్పష్టంగా పేర్కొనడం.. మరోవైపు 32.320 మెట్రిక్ టన్నుల బొగ్గును చూపిస్తున్న బిల్లు వెలుగులోకి రావడంతో ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 29.61 టన్నుల సరుకు బరువు లెక్క ఏ వాహనాలకు వర్తిస్తుంది? 32.320 టన్నుల బొగ్గు రవాణాకు ఏ నిబంధన ఆధారం? ఆ వాహనానికి అనుమతించదగిన సరుకు బరువు ఎంత? తూకం కేంద్రంలో వాస్తవ బరువు ఎంత నమోదైంది? ఈ ప్రశ్నలకు సింగరేణి మణుగూరు ప్రాంత అధికారులు లిఖితపూర్వకంగా స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

**చివరి ప్రశ్న ఇదే..**

"సమాచార హక్కు సమాధానంలో 29.61 టన్నులే.. బిల్లులో 32.320 టన్నులు.. ఈ 2.710 టన్నుల తేడా ఎక్కడి నుంచి వచ్చింది?" ఈ లెక్కలపై సింగరేణి యాజమాన్యం సమగ్రంగా వివరణ ఇస్తేనే బొగ్గు రవాణాపై నెలకొన్న అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.ఝఝ

# భారత్‌లోకి చొరబడిన పాక్ డ్రోన్..

(మొదటి పేజీ తరువాయి)

ఈ డ్రోన్ కొద్దిసేపు తిరిగింది. ఆ తర్వాత మంగళ్‌నార్-దబ్రోత్ వైపు కదులుతూ మన భూభాగంలోకి చొరబడేందుకు ప్రయత్నించింది. అయితే సరిహద్దుల్లో కాపలా కాస్తున్న మన జవాన్లు తక్షణమే స్పందించడంతో, ఆ డ్రోన్ వెనక్కి తగ్గి తిరిగి పాకిస్తాన్ వైపు వెళ్లిపోయింది.

డ్రోన్ వెనక్కి వెళ్లినప్పటికీ, అది మన సరిహద్దుల్లోకి ఆయుధాలు, డ్రగ్స్ లేదా పేలుడు పదార్థాలను ఏమైనా డ్రాప్ చేసిందా అన్న కోణంలో ఆర్మీ శనివారం ఉదయాన్నే భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. జమ్మూ కాశ్మీర్ పోలీసులు, బీఎస్ఎఫ్, సైనిక దళాలు కలిసి అడవులు, ముందు వరుస గ్రామాల్లో జల్లెడ పడుతున్నాయి. ఏ చిన్న అనుమానాస్పద వస్తువు దొరికినా స్వాధీనం చేసుకునేలా నిఘా వ్యవస్థను మరింత పెంచారు. వరుస ఘటనలతో పెరిగిన ఆందోళన గత కొద్దివారాలుగా జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లో పాక్ డ్రోన్ల చొరబాట్లు ఎక్కువవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నెలలోనే కతువా జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోనూ, గత నెలలో రాజౌరీలోని సుందర్‌బని సెక్టార్‌లోనూ పాక్ డ్రోన్లు కనిపించాయి. జూన్ నెలలోనూ బాలాకోట్ సెక్టార్‌లోనే డ్రోన్ రాగా, మన బలగాలు కాల్పులు జరపడంతో అది పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి పారిపోయింది. ఉగ్రవాదులకు ఆయుధాలు చేరవేయడమే లక్ష్యంగా పాక్ ఈ తరహా కుట్రలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది.

# ఫుడ్ ప్యాకెట్లపై ఇకపై రెడ్ మార్క్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజారోగ్యాన్ని కాపాడే నిబంధనలను రూపొందించడంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆలస్యం చేయడంపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు ఘాటు వ్యాఖ్యలతో రంగంలోకి దిగిన ఆహార భద్రతా సంస్థ, ఐసీఎమ్ఆర్-ఎన్ఐఎన్ నిర్దేశించిన ప్రమాణాల ఆధారంగా ఆరు పేజీల అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించింది. వినియోగదారులకు ఏది మంచిదో, ఏది చెడో క్షణాల్లో తెలపడానికి ప్యాకెట్ ముందే స్పష్టమైన ఎరుపు రంగు లేబుల్ వేయాలని నిర్ణయించింది.

ప్రతిపాదిత కొత్త నిబంధనల ప్రకారం, ప్యాకెట్ ముందు భాగంలో ఎరుపు రంగు ఆరుభుజాల ఆకారంలో వార్నింగ్ గుర్తును ముద్రించాలి. ఇవి సులువుగా అందరి కంటికి కనిపించేలా ఉండాలి. వెనుక ముద్రించే సాధారణ పోషకాల వివరాల కంటే ఈ లేబుల్‌లోని అక్షరాలు పెద్దగా ఉండాలి. ఒకవేళ కొవ్వు ఎక్కువగా ఉంటే "హై ఫ్యాట్", చెక్కర ఎక్కువగా ఉంటే "హై షుగర్", ఉప్పు ఎక్కువగా ఉంటే "హై సాల్ట్" అని రాయాలి. ఒకవేళ రెండూ ఎక్కువగా ఉంటే "హై ఫ్యాట్, హై షుగర్" అని, అలాగే కూల్ డ్రింక్స్‌పై "హైలీ స్వీటెండ్ బెవరేజ్" అని పెద్దగా ముద్రించాల్సి ఉంటుంది.

వీటికి మాత్రం మినహాయింపు!

ప్రతిపాదించిన నిబంధనల నుంచి కొన్ని రకాల సహజసిద్ధమైన పదార్థాలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ మినహాయింపు ఇచ్చింది. ఒకే ఒక్క పదార్థంతో రూపొందే సహజ ఉత్పత్తులకు ఈ ఎరుపు రంగు వార్నింగ్ లేబుళ్లు అవసరం లేదని తెలిపింది. పాలు, నెయ్యి, వంట నూనెలు, స్వచ్ఛమైన పంచదార, బెల్లం, తేనె వంటి నాచురల్ పదార్థాలకు ఈ వార్నింగ్ సింబల్స్ నుంచి ఊరట కలిగించారు.

ఈ సరికొత్త రూల్స్‌ను దేశవ్యాప్తంగా రెండు దశల్లో అమల్లోకి తీసుకురావాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ భావిస్తోంది. మొదటి దశలో రెండింటి కంటే ఎక్కువ హానికర పోషకాలుగా పరిగణించే ఉప్పు, పంచదార, కొవ్వు) ఉన్న పదార్థాలతో పాటు, ఎక్కువ తీపి ఉండే కూల్ డ్రింక్స్ ప్యాకెట్లపై వార్నింగ్ గుర్తును తప్పనిసరి చేస్తారు. ఆ తర్వాత రెండో దశలో, కేవలం ఒక్క పోషకం పరిమితికి మించి ఉన్న ప్యాకేజ్డ్ ఆహారాలకు కూడా ఈ రెడ్ కలర్ వార్నింగ్ నిబంధనను విస్తరిస్తారు.

# హైదరాబాద్ మెట్రో సేవల్లో అంతరాయం..

(మొదటి పేజీ తరువాయి)

టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులు మెట్రో స్టేషన్లకు చేరుకున్న తర్వాత ఆటోమేటిక్ గేట్ల వద్ద సమస్యను ఎదుర్కొన్నారు. టికెట్లను స్కాన్ చేయాల్సిన సెన్సార్లు పనిచేయకపోవడంతో ఇన్‌గేట్‌లతో పాటు ఔట్‌గేట్‌ల వద్ద కూడా ప్రయాణికులు నిలిచిపోయారు.

ఇవాళ ఉదయం ఆఫీసులు, స్కూళ్లు, విద్యాసంస్థలకు వెళ్లే సమయంలోనే మెట్రో స్టేషన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పలు స్టేషన్ల వద్ద క్యూలు పెరిగినట్లు సమాచారం. టికెట్ తీసుకున్నప్పటికీ గేట్లు తెరుచుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సెన్సార్లు పనిచేయకపోవడంతో ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో స్టేషన్ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. సమస్యను వెంటనే పరిష్కరించలేకపోవడంతో ప్రయాణికులు మరింత అసంతృప్తికి గురయ్యారు. మెట్రో సర్వీసుల్లో తలెత్తిన టెక్నికల్ సమస్యలను పరిష్కరించలేక సిబ్బంది చేతులెత్తేసినట్లు తెలుస్తోంది.

మెట్రో ఆన్‌లైన్ టికెటింగ్, స్కానింగ్ సేవల్లో తరచూ ఇలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టికెట్లు కొనుగోలు చేసిన తర్వాత కూడా గేట్ల వద్ద ఎక్కువసేపు వేచి ఉండాల్సి రావడం వల్ల తమ ప్రయాణ సమయం వృథా అవుతోందని వాపోతున్నారు. మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలో సాంకేతిక అంతరాయాలు ఏర్పడకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ఏపీకి కాసుల పంట

(మొదటి పేజీ తరువాయి)

బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి.

ఈ బొగ్గు నిల్వల వినియోగానికి ఏపీ సర్కార్ కు భారీ ఆదాయం 30 ఏళ్లపాటు ఈ బొగ్గు నిల్వలను వినియోగించుకున్నందుకు 14 శాతం రాయల్టీ రూపంలో రూ.50 వేల కోట్లు, బొగ్గు ధరలో 2.75 శాతం రెవెన్యూ వాటాగా రూ.10 వేల కోట్లు, జిల్లా ఖనిజ ఫౌండేషన్ కింద రూ.5 వేల కోట్లు గనుల శాఖకు దక్కనున్నాయి. అనుబంధ పరిశ్రమల నుంచి ఎస్‌జీఎస్టీ రూపంలో మరిన్ని వేల కోట్లు రావచ్చని అంచనా. దేశంలోనే తొలిసారి భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్ట్ దేశంలోనే తొలిసారి ప్రారంభిస్తున్న ఈ భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్ట్ ద్వారా భూగర్భంలోనే బొగ్గును మండించి సింగ్యాస్‌ను పైకి తీసుకొస్తారు. దీని నుంచి హైడ్రోజన్, మెథనాల్, అమ్మోనియా, సింథటిక్ నేచురల్ గ్యాస్, సింథటిక్ ఇంధనాలు తయారు చేయవచ్చు. 2030 నాటికి రోజుకు 20-50 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్స్ సింగ్యాస్ ఉత్పత్తి చేసే ప్రధాన ప్లాంట్ అందుబాటులోకి రానుంది.

వచ్చే ఏడాది పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

ఈ ఏడాది ఖనిజ అన్వేషణ, వచ్చే ఏడాది పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం అవుతుంది. 2028-30 మధ్య కమర్షియల్ గ్యాసిఫైయర్ బావుల డ్రిల్లింగ్, 2030 నాటికి పూర్తిస్థాయి ప్రాజెక్ట్ అందుబాటులోకి రానుంది. ప్రభుత్వం వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి, అనుమతులు, భూసేకరణకు ఏలూరు జిల్లా సంయుక్త కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించింది. లోతైన బొగ్గు నిల్వలను వినియోగించుకునే ఈ ప్రాజెక్ట్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త ఊతం ఇవ్వనుంది.

# వేపచెట్టు విషయంలో వివాదం

(మొదటి పేజీ తరువాయి)

రేపింది. ఇంటి సరిహద్దులో ఉన్న వేపచెట్టు విషయంలో రెండు కుటుంబాల మధ్య పాతికేళ్లుగా కొనసాగుతున్న వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు, భూక్యా సైదా మృతి చెందారు. సైదా కుమారుడు రాము పైఇద్దరినీ గొడ్డలితో హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లు, భూక్యా సైదా కుటుంబాల మధ్య ఇంటి సరిహద్దులో ఉన్న వేపచెట్టు విషయంలో సుమారు 25 ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం వెంకటేశ్వర్లు కొందరిని పిలిపించి వివాదాస్పద వేపచెట్టు కొమ్మలను నరికించే ప్రయత్నం చేయగా గొడవ జరిగినట్లు తెలుస్తోంది.

ఈ విషయం గమనించిన భూక్యా సైదా కుమారుడు రాము అక్కడికి వెళ్లి చెట్టును ఎలా నరికేస్తారని ప్రశ్నించాడని స్థానికులు పేర్కొన్నారు. దీంతో ఇరువురి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో రాము గొడ్డలితో వెంకటేశ్వర్లుపై దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. తీవ్ర గాయాలతో వెంకటేశ్వర్లు ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు సమాచారం. వెంకటేశ్వర్లుపై దాడి జరిగిన విషయం గమనించిన రాము తండ్రి భూక్యా సైదా అక్కడికి వచ్చి తన కుమారుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అయితే ఈ క్రమంలో రాము తన తండ్రి సైదాపై కూడా గొడ్డలితో దాడి చేసినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన సైదాను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు తెలుస్తోంది.



# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసనలు



**హసన్‌పర్తి, ఆగస్ట్ 29 (పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఆ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు 66వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మండల అధ్యక్షుడు బండి రజినీకుమార్ తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై ప్రజల్లో చర్చ జరిగేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిందని వారు ఆరోపించారు. డివిజన్, మండల కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, రైతులు, యువకులు, సోషల్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు ఇమ్మడి రాజేందర్, 53వ డివిజన్ ఇన్‌చార్జి బోడ యుగంధర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గిన్నెరపు రవీందర్, కేదాసి రాకేష్, చాతల్లా వేణుగోపాల్, చంద్రకర్ రెడ్డి, ప్రమోద్, తాళ్ల మహేందర్, శీలం అనిల్, దాసరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి యువత ధ్యాన్ చంద్ గారిని స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలి

- **మేజర్ ధ్యాన్ చంద్ జయంత్ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించి, పురపాలక సంఘ పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బంది క్రికెట్ క్రీడా పోటీలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.**



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) ఆగస్టు 29 :** ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పురపాలక సంఘ చైర్పర్సన్ శ్రీమతి దండి లక్ష్మి హాజరైఆయన క్రీడా రంగానికి చేసిన అసమాన సేవలను స్మరించుకుంటూ, భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రకటించింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఇచ్చే అత్యున్నత పురస్కారానికి 'మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు'గా పేరు మార్చి ఆయనను గౌరవించుకున్నాము. నేటి యువత ధ్యాన్ చంద్ గారిని స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని, భారతదేశానికి 1928, 1932, 1936 ఒలింపిక్స్‌లో వరుసగా మూడు బంగారు పతకాలను అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. హాకీ ఆటలో ఆయన చూపిన ప్రతిభకు గానూ ఆయనను 'హాకీ మాంత్రికుడు' అని పిలుస్తారని తెలియజేశారు.అనంతరం క్రికెట్ గేమ్ లో గెలిచిన జట్టుకు ట్రోఫీ అందించడం జరిగింది.పాలకవర్గ సభ్యుల కు షీల్డ్ తో బహుకరించడం జరిగింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వి.అనిల్ కు ప్రధానం చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ .కమిషనర్ మల్లికార్జున్ గౌడు ,వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ , కౌన్సిలర్స్ అనూష , లత , రజిత , తిరుపతి , బొలిశెట్టి రాజు , సంపత్ , సరిత ,గడిపే సంపత్ , మంజుల , వరప్రసాద్ , రమేష్ , శ్రీనివాస్ తో,రజిత , కిరణ్ ప్రసాద్ , గాదెపాక రవీందర్ ,సుప్రజ , బత్తుల స్వరూప , శోభన్ బాబు , కో ఆప్షన్ సభ్యులు లావణ్య , హసన్ , సరోజన , గ్లోరినా , ప్రజా ప్రతినిధులు రమణ , మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై అధికారులు తక్షణమే స్పందించాలి



- **ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తాం :నడిగోటి నరేష్**

**భీమదేవరపల్లి ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ ):** కొత్తపల్లి గ్రామ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్లలో ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని 8వ వార్డు సభ్యుడు నడిగోటి నరేష్ డిమాండ్ చేశారు. రెండు నెలల క్రితమే పత్రికా ప్రకటన ద్వారా ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు క్షేత్రస్థాయి పరిశీలన గానీ, పనుల నిలిపివేత చర్యలు గానీ తీసుకోకపోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నడిగోటి నరేష్ మాట్లాడుతూ పలు కీలక ప్రశ్నలను లేవనెత్తారు: రెండు నెలల క్రితమే అక్రమ నిర్మాణాల వ్యవహారం వెలుగులోకి వచ్చినా అధికారులు ఎందుకు స్పందించలేదు? ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలకు సంబంధించిన అధికారిక అనుమతులు ఉన్నాయా? నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తున్నా చర్యలు



తీసుకోవడం లో ఆలస్యానికి కారణమేమిటి? స్థానిక గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి, నోటీసులు జారీ చేసి అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని ఆయన కోరారు. ఈ వ్యవ హారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేస్తూ, త్వరలోనే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే 'ప్రజావాణి' గ్రీవెన్స్ కార్యక్రమంలో అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# చిగురుమామిడి రైతువేదికలో రైతులకు ఆత్మ శిక్షణ కార్యక్రమం

**ముఖ్యఅతిథిగా హాజరైన ఆత్మ పిడి చత్రునాయక్**

**చిగురుమామిడి,ఆగస్టు29 (పీపుల్స్ డైరీ):** మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం రైతులకు ఆత్మ-ఆర్ పిఎల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.వరి సాగులో ఆధునిక పద్ధతులు,తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం జరిగిందని వ్యవసాయ శాఖ మండల అధికారి తాటిపల్లి పున్నమి చందర్ రెడ్డి తెలిపారు.ఈ శిక్షణలో ముఖ్య అతిథిగా ఆత్మ పిడి చత్రు నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వరి పంటలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అందించే 7రకాల సన్న రకాల వంగడాల గురించి రైతులకు వివరించారు.వరి సాగులో శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు,కాలానుగుణంగా వచ్చే పురుగులు,తెగుళ్ల యాజమాన్యం,సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు.మరో ముఖ్య వక్త, బి.జె.ఆర్ అగ్రికల్చర్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్,శాస్త్రవేత్త శ్రీ హరికృష్ణ మాట్లాడుతూ వరి పంటలో నాణ్యమైన దిగుబడులు సాధించడానికి పంట దశల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.సన్న రకాల ఎంపిక, శాస్త్రీయ ఎరువుల యాజమాన్యంపై రైతులకు దిశానిర్దేశం చేశారు. పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లను ముందుగానే గుర్తించి, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిం చాలని ఆయన సూచించారు. అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలను అధికారులు, శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా వరి పంటలో అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తి,మెరుగైన ఆదాయాన్ని సాధించవచ్చని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో



చిగురుమామిడి గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని,మండల వ్యవసాయ శాఖ అధికారి పున్నం చందర్ రెడ్డి,ఏటీఎం అర్చన,వ్యవసాయ విస్తరణ అధికారులు,చిగురుమామిడి మండల పరిధిలోని పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



**సైదాపూర్ ఆగస్టు 29 ( పీపుల్స్ డైరీ ) :** సైదాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించిన హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ సైదాపూర్ మండలం గుజ్జులపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ బొంకూరి కొమురయ్య గారి సతీమణి రాజమ్మ గారు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం నల్ల రామయ్యపల్లి గ్రామంలో పోలసాని లక్ష్మణరావు రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకుని, వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఓల్నాని నర్సింహారావు గారికి కాలు ఆపరేషన్ జరిగిన నేపథ్యంలో, వారి నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం కొనసాగి ంచాలని ఆకాంక్షించారు. బొమ్మకల్ గ్రామంలో వేముల నారాయణ మీ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పల్ల భాగ్య ఏలూరి రాధ , చిట్టీ కిరణ్ కుమార్ రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని వొడితల సతీష్ కుమార్ భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవీందర్రావు స్థానిక బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సోమారపు రాజయ్య సింగిల్ విండో అధ్యక్షులు బిల్లా వెంకట్ రెడ్డి వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్ రెడ్డి ఉపసర్పంచి మోహన్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

# లస్మన్నపల్లి లో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా పరిశీలన



**సైదాపూర్ ఆగస్టు 29 ( పీపుల్స్ డైరీ ) :** ఓటర్లుగా నమోదు కాని వారి వివరాల రీ-వెరిఫికేషన్‌కు మండలం లోని లస్మన్నపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ప్రత్యేక విచారణ నిర్వహించారు. జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలించి, సంబంధిత రికార్డులను సేకరించే ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సైదాపూర్ తహశీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా రీ-వెరిఫికేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మ్యాకల స్వప్న -సంపత్ రెడ్డి ఆర్ ఐ వినోద్ వార్డు సభ్యుడు వడ్ల మమత బీఎల్ఓ అబిడి స్వరాజ్యం గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంద్రమ్మ ఇండ్ల ప్రాసెసింగ్ కాపీలను అందచేసిన సర్పంచ్ పూదరి రమ్యకృష్ణ



**వీణవంక ఆగస్టు 30( పీపుల్స్ డైరీ) :** మండలంలోని కోర్కల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంద్రమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రాసెసింగ్ కాపీలను అందజేయడం జరిగింది.కోర్కల్ గ్రామ సర్పంచ్ పూదరి రమ్యకృష్ణ ఐదుగురి లబ్ధిదారులకు ప్రాసెసింగ్ కాపీలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు ఇండ్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ త్వరగా ఇండ్ల నిర్మాణం పనులు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కార్యదర్శి, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**శంకరపట్నం అగస్టు:29 పీపుల్స్ డైరీ :** మండలం లోని తాడికల్ ఉన్నత పాఠశాల ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ పుట్టినరోజు పురస్కరించుకొని శనివారం రోజున జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శంకరపట్నం మండలంలోని తాడికల్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఆడెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు మాట్లుడుతూ నేటి తరం విద్యార్థులు ధ్యాన్ చంద్ ను ఆదర్శంగా తీసుకుని అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలన్నారు. మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ గారు మండలంలోని విద్యార్థులకు, యువతకు, క్రీడాభిమానులకు క్రీడా సంఘాలకు జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా పౌర హక్కుల దినోత్సవం



**చిగురుమామిడి,ఆగస్టు29 (పీపుల్స్ డైరీ):** రామంచ గ్రామము అంబేద్కర్ కూడలిలో గ్రామ సర్పంచి ఒంటెల కిషన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగినది.ఎంపీడీఓ రామ్మోహన చారీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 17 ప్రకారం అంటరాని తనం అనేది పూర్తిగా నిర్మూలించడం నిషేదించడం జరిగినదని, సమాజంలో పౌరులు అందరూ సమానమేనని,స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో అందరూ కలసి మెలసి జీవించాలని, పౌరులు అందరూ చట్టాల పట్ల అవగాహన పెంచుకొని తధనుగుణంగా నడుచుకోవాలని,హోటల్ లో రెండు గ్లాసుల విదానంగాని,ఆలయ ప్రవేశ విషయములో గాని వివక్ష చూపవద్దని అలా ఎవరైనా వివక్ష చూపినట్లయితే చట్ట రీత్యా నేరం అని,అందుకు బాద్యులు అవుదురుని తెలియపరచ్చినారు.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.ఈ గ్రామములో అందరం సోదర భావముతో కలసి మెలసి జీవిస్తున్నామని తమ మధ్య బేధాభిప్రాయాలు లేవని తెలిపినారు.ఇట్టి కార్యక్రమంలో ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి,ఏ ఈ ఓ ప్రణయ్,స్కూల్ హెడ్ మాస్టర్,ఎస్సీ హాస్టల్ వార్డెన్, ఆశా వర్కర్,అంబేద్కర్ సంఘం ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శ



**చిగురుమామిడి,ఆగస్టు29 (పీపుల్స్ డైరీ):** మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన కుటుంబాలను హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్ వారి కుటుంబాల వివరాలు అడిగి తెలుసుకుని మీకు ఎల్లప్పుడూ అనే విధాలుగా పార్టీ అండగా ఉంటుందని ధైర్యాన్ని కల్పించారు మండల కేంద్రంలోనీ కోనేటి వెంకవ్వ సీతారాంపూర్, ముసుకుల వెంకటరెడ్డి ఇందుర్తి చెందిన బల్ల రాములు,గౌరవెల్లి లచ్చమ్మ, రామంచ నర్రా జగదీశ్వర్ రెడ్డి,పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ బేతి రాజ్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షులు రామోజీ కృష్ణమాచారి మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు,సర్పంచ్ ఓంటల కిషన్ రెడ్డి,ఉప సర్పంచ్లు కాశ బోయిన విజయలక్ష్మి, గిట్ల తిరుపతిరెడ్డి,వార్డ్ మెంబర్ తాటికొండ అభిషేక్ రెడ్డి,యూత్ అధ్యక్షులు తాటికొండ సందీప్ రెడ్డి, కాశబోయిన రాజు, సీనియర్ నాయకులు అంతే సుజాత పోచయ్య అందే రాయమల్లు మహంకాళి కొమురయ్య శ్యామకూర సంపత్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు ఎస్కే సిరాజ్ పరిపాల రవీందర్ రెడ్డి బిల్లా వెంకట్రెడ్డి చెరుకు సంజీవ్ మాజీ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**రేగొండ ఆగస్టు 29 పీపుల్స్ డైరీ..** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ను రేగొండ ఎస్ఐ సుధాకర్ పట్టుకున్నారు. రేగొండ మండల పరిధిలోని కనిపర్తి గ్రామ శివారు మానేరు వాగు నుండి శనివారం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు రేగొండ పోలీసులకు సమాచారం అందింది. నమ్మదగిన సమాచారం మేరకు కనిపర్తి సమీపంలో పోలీసులు ఇసుక తరలిస్తున్న కూసుంబ రాకేష్ కాకర్ల పల్లి, గోల్కొండ అనిల్ నవబ్ పేట చిట్యాల మండలం, పప్పు శ్రీనివాస్ నవాబ్ పెట, సామర్ల రాజు, రేపాక, రేగొండ మండలం, అనే వెక్తుల ట్రాక్టర్లను పట్టుకుని విచారించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి ట్రాక్టర్ను పోల్సస్టేషన్కు తరలించి చట్టపరమైన కేసు నమోదు చేసారు. ఈ సందర్బంగా ఎసై సుధాకర్ మాట్లాడుతూ అక్రమ ఇసుక తవ్వకాలు, రవణపై నిరంతరం నిఘా కొనసాగుతుశిదని ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగించి ఎటువంటి కార్యాలపాలకు పాల్పడిన కఠినమైనా చర్యలు తీసుకుంటామని చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు..

# డిపో అభివృద్ధికి ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి

**బెస్ట్ ఇ.పీ.కే తెచ్చిన కండక్టర్ ను సన్మానించిన డిపో మేనేజర్ ఎన్. వెంకన్న**



**హుస్నాబాద్, టౌన్ : (పీపుల్స్ డైరీ) ఆగస్టు 29 :** హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేసినప్పుడే లాభాల బాట పడుతుందని అందుకు అందరూ ఉద్యోగులు కృషి చేయాలని హుస్నాబాద్ డిపో మేనేజర్ ఎన్. వెంకన్న అన్నారు.రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపి ప్రయాణికులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషిచేసిన హుస్నాబాద్ ఆర్టీసీ డిపో కండక్టర్ డ్రైవర్లకు అభినందనలు తెలిపారు. అందులో భాగంగా రాఖీ పౌర్ణమి రోజు బెస్ట్ ఇపీకే తెచ్చిన కండక్టర్ జి. జ్యోతిని డిపో మేనేజర్ శాలువాతో సత్కరించి అభినందించారు.ఇలాగే అందరూ ఉద్యోగులు ఆదర్శంగా తీసుకొని డిపో అభివృద్ధికి కృషి చేయాలని మేనేజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి ఐ సారయ్య సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడు అరెస్ట్



**భూపాలపల్లి ఆగస్టు 29 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి జిల్లా అడవిముత్తారం పోలీస్ స్టేషన్ పరిధిలో భూపాలపల్లి సీసీఎస్ పోలీసులు అడవిముత్తారం పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా నుంచి మేడారం మీదుగా కాటారం వైపు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న దానం శశికృష్ణ (కాటారం గ్రామం)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 1 కిలో 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 70,000/–గా అంచనా వేశారు.నిందితుడిపై నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టాన్సెస్ యాక్ట్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ సందర్బంగా పోలీసులు మాట్లాడుతూ గంజాయి సేవించడం, విక్రయించడం లేదా అక్రమంగా రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టాన్సెస్ యాక్ట్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

# ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి..**



**భూపాలపల్లి ఆగస్టు 29 పీపుల్స్ డైరీ..** శనివారం హైదరాబాద్ రాష్ట్ర ఎన్నికల సంగం కార్యాలయం నుండి సర్ ప్రక్రియపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఎ.ఈ.ఆర్.ఓ లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్ ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుండి 7 రోజుల గడువులోగా విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్, నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందచేసి సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్,అభ్యంతరాలపై ప్రతి రోజు నివేదికలు పంపాలని ఆదేశించారు. ఇట్టి ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని తెలిపారు. ఓటరులకు ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించిన ఎ.ఈ.ఆర్.ఓలకు శిక్షణ ఇవ్వాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ**

పారదర్శకమైన తప్పులులేని ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యంగా జరుగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియను సకాలంలో. పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియపై మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలిస్ ఓటర్లుకు నోటీసులు జారీపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించామని తెలిపారు. జిల్లాలో 11,739 మంది మ్యాపింగ్ కాని ఓటర్లు, 20,685 మంది అనామలీస్ ఓటర్లు మొత్తం 32,424 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రక్రియ పూర్తి చేసేందుకు తహసీల్దార్లు, ఎంపిడిఓలు ద్వారా నోటీసులు జారీ చేసి, వారం రోజుల్లో విచారణ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రతి మండలంలో ఎంపిడిఓలను, మున్సిపల్ కమిషనర్ను అదనపు ఏఈఆర్ఓలుగా నియమించినట్లు తెలిపారు. నోటీసులు జారీ చేసిన ఓటర్లు నిర్దేశిత తేదీల్లో విచారణకు హాజరై ఎన్నికల సంగం ఆదేశాల ధ్రువీకరణ ఆధారాలను సమర్పించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూతు సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేసేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన స్పష్టంచేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిటి అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

- **శాంతి కమిటీ సమావేశంలో హుసన్పర్తి సీఐ మహేందర్**

**హసన్పర్తి, ఆగస్ట్ 29 (పీపుల్స్ డైరీ) :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని హసన్పర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏ. మహేందర్ కోరారు. శనివారం హసన్పర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ మహేందర్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, పీస్ కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ మాట్లాడుతూ.. గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీస్, ఇతర ప్రభుత్వ శాఖల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద రాత్రివేళ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, వీలైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ వైరింగ్లో జాగ్రత్తలు పాటించాలని, అనుమతి లేని విద్యుత్ కనెక్షన్లు వినియోగించరాదన్నారు.

**ధ్వని కాలుష్యంపై నిబంధనలు పాటించాలి**



రాత్రివేళల్లో కోర్టు నిబంధనలకు అనుగుణంగా లౌడ్స్పీకర్ల వినియోగం ఉండాలని సీఐ సూచించారు. అశ్లీల పాటలు, అనుమతి లేని డీజేలకు తావివ్వరాదన్నారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా పోలీసులు సూచించిన మార్గాల్లోనే ఊరేగింపు నిర్వహించాలని కోరారు.ఎస్సైలు రవి, గోవర్ధన్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులకు భద్రతాపరమైన, సాంకేతిక అంశాలపై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో స్థానిక నాయకులు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పీస్ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బూత్ అధ్యక్షులు, ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లాలి..బైరి శంకర్






- **అర్హుల ఓటుహక్కు పరిరక్షణే బాధ్యత**
- **బిజెపి జిల్లా అధ్యక్షుడు-బైరి శంకర్**

**హుస్నాబాద్. టౌన్ : (పీపుల్స్ డైరీ) ఆగస్టు 29 :** ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడి ఓటుహక్కును పరిరక్షించడమే బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల ప్రధాన బాధ్యత అని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటుహక్కుకు దూరం కాకుండా కృషి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా అనంతరం రెండో విడత కార్యక్రమంపై హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బూత్ అధ్యక్షులు, బూత్ స్థాయి ఏజెంట్లకు హుస్నాబాద్ రియల్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో అవగాహన సమావేశం నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్, బూత్ స్థాయి ఏజెంట్-1 గుర్రాల లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి బైరి శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎస్ఐఆర్ జోనల్ ఇన్చార్జి కటకం ఆంటోనీ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బైరి శంకర్ మాట్లాడుతూ.. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు, నోటీసులు అందుకున్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలు సమర్పించి ఓటర్ల జాబితాలో పేరును కొనసాగించుకునే అవకాశం ఉందని తెలిపారు. కటకం ఆంటోనీ రెడ్డి మాట్లాడుతూ.. నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలు, అభ్యంతరాలు--దావాలు దాఖలు చేసే విధానం, 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయడం, చిరునామా మారినవారు చేపట్టాల్సిన ప్రక్రియపై బూత్ అధ్యక్షులు, ఏజెంట్లకు అవగాహన కల్పించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించాలని సూచిం చారు. ఎస్ఐఆర్ను రాజకీయ కోణంలో కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా బాధ్యతతో నిర్వహిం చాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తుది ఓటర్ల జాబితాలో ఉండేలా బూత్ స్థాయి నుంచి కృషి చేయాలని నాయకులకు సూచించారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఎస్ఐఆర్ ఇన్చార్జి సతీష్కుమార్, జిల్లా కన్వీనర్ విభూషన్రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పైడిపల్లి పృథ్వీరాజ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నునావత్ మోహన్నాయక్, తోట స్వరూపతోపాటు వివిధ మండలాల బీజేపీ అధ్యక్షులు, నాయకులు, బూత్ అధ్యక్షులు, ఏజెంట్లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముల్కనూర్ ప్రాంత సమస్యలపై మంత్రి దృష్టి సారించాలి

**బీఎస్పీ మండల అధ్యక్షులు బుసుమల్ల రాజు**

**భీమదేవరపల్లి, ఆగస్టు 29:(పీపుల్స్ డైరీ ):** భీమదేవరపల్లి మండలంలో పలు గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు బుసుమల్ల రాజు కోరారు. భీమదేవరపల్లి మండలంలో మంత్రి పర్యటన నేపథ్యంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి గతంలో ఆదేశించినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. స్థానిక ప్రజలకు డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముల్కనూర్ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, విద్యార్థుల భద్రత దృష్ట్యా నూతన భవనం నిర్మించడంతో పాటు తక్షణ మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎల్కతుర్తి--సిద్దిపేట జాతీయ రహదారి పనులు పూర్తయిన నేపథ్యంలో భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల వద్ద సూచిక బోర్డులు, ప్రమాద హెచ్చరికలు, మలుపుల వద్ద సైన్బోర్డులు, వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు ఇప్పటికే జరిగాయని ఇంకా అధిక,ముప్పు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రవాణా శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గట్ల నర్సింగాపూర్ వంతెన గత ఏడాది తుఫాను ధాటికి రోడ్డు తెగి ప్రమాదకరంగా మారిందని గుర్తు చేశారు,నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్నందున భక్తులు, వాహనాల రాకపోకలు పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అంతకుముందే వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. ఇక పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి పాడి గేదెల పథకం అమలుకు దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఇప్పటివరకు లబ్ధిదారులకు పశువులు అందలేదని తెలిపారు. ఎన్ని నో ప్రభావంతో వ్యవసాయంపై ఆధారపడే రైతులకు వర్షాలు పడక పంటలు పండే అవకాశం లేదని,పాడి పశువులతో ఉపాధి గా ఏర్పడే అవకాశం ఉన్నందున అర్హులకు త్వరగా పంపిణీ చేయాలని కోరారు.ప్రాంత ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ను బుసుమల్ల రాజు కోరారు.



# రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోండి

**జిల్లా సెషన్స్ జడ్జి ఆర్ సుదర్శన్**




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29 :** రాజీ పడదగ్గ కేసులను సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని జిల్లా సెషన్స్ జడ్జి ఆర్ సుదర్శన్ కక్షిదారులకు సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించు కోవడంతో సమయం, ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. శనివారం సిద్దిపేట జిల్లా కోర్టులో జిల్లా సెషన్స్ జడ్జి ఆర్ సుదర్శన్, జిల్లా అదనపు న్యాయమూర్తి జయప్రసాద్, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి సౌజన్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 12న సిద్దిపేట జిల్లా కోర్టుతో పాటు దుబ్బాక, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించ నున్నట్లు తెలిపారు. రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 756 కేసులు పరిష్కరించగా, మోటారు వాహన ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లో రూ. 92.26 లక్షల నష్టపరిహారం ఇప్పించినట్లు తెలిపారు. బ్యాంకు కేసులకు సంబంధించి రూ. 30.32 లక్షల మేర పరిష్కారం సాధించినట్లు వివరించారు. జూన్‌లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 814 కేసులు పరిష్కరించగా, మోటారు వాహనాలకు సంబంధించిన కేసుల్లో రూ. 78.65 లక్షల నష్టపరిహారం ఇప్పించినట్లు తెలిపారు. బ్యాంకు కేసులకు సంబంధించి రూ. 5.77 లక్షల మేర సెటిల్‌మెంట్ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో కేసుల్లో బాధితులకు రూ. 25 లక్షల పరిహారం మంజూరు కాగా, ఇప్పటివరకు రూ. 4 లక్షలు అందజేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు 1,776 కేసులను గుర్తించినట్లు జిల్లా సెషన్స్ జడ్జి తెలిపారు. వీటిలో 518 మందికి ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. అదేవిధంగా చెక్ బౌన్స్‌కు సంబంధించిన 1,323 కేసులను గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసులకు సంబంధించిన కక్షిదారులు సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా సెషన్స్ జడ్జి ఆర్ సుదర్శన్ కోరారు.

# నీట్ పీజీ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు-జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి



**సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 29 :** ఈనెల 30వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నేపథ్యంలో జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో భారతీయ నాగరిక భద్రతా సంహిత–2023లోని 163వ సెక్షన్ నిబంధనలను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు ఈనెల 30వ తేదీ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు లేదా పరీక్ష పూర్తయ్యే వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల, వెరిటాస్ అండ్ విర్టస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకచోట గుమికూడడం, కర్రలు, కత్తులు, లాఠీలు, ఆయుధాలు లేదా ఇతర హానికరమైన వస్తువులు కలిగి ఉ ఒడడం, చట్టవిరుద్ధంగా గుమికూడడం నిషేధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఉన్న ప్రతుల కేంద్రాలు, అంతర్జాల కేంద్రాలు తదితరాలను పరీక్ష జరిగే సమయంలో మూసివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా ప్రజలు, సంబంధిత వ్యాపార సంస్థలు, పరీక్షార్థులు మరియు వారి తల్లిదండ్రులు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి కోరారు.

# ఖైదీలకు న్యాయ సహాయం అందించేందుకు ప్రత్యేక చర్యలు




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29 :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి సుదర్శన్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె సౌజన్య శనివారం సాయంత్రం సిద్దిపేట జిల్లా జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలతో ఆమె మాట్లాడి వారి యోగక్షేమాలు, వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీల వంటగది, నిల్వ గది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న భోజనం, వసతుల గురించి జైలు సూపరింటెండెంట్ వికాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కె సౌజన్య మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఖైదీలకు ఎదురవుతున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి ఖైదీకి న్యాయవాది ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. న్యాయవాదులు లేని ఖైదీలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు ప్రతి వారం జైలును సందర్శించి, న్యాయవాది అవసరమైన ఖైదీలకు తగిన న్యాయ సహాయం అందిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు ఎం. రవికుమార్, డి రవీందర్, జైలు సూపరింటెండెంట్ వికాస్, జైలు సిబ్బంది, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయకుంటే ఉద్యమం ఉధృతం

- సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో నిరసన దీక్ష
- రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రెడ్డి సామాజిక వర్గంలోని నిరుపేదలను ఆదుకోవాలని రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జిల్లా రెడ్డి జేఏసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న నిరసన దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను అప్పమ్మగారి రాంరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెడ్డి సామాజిక వర్గాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో పలు రెడ్డి బహిరంగ సభల్లో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రెండేళ్ల క్రితం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెడ్డి సామాజిక వర్గం కోసం హైదరాబాద్‌లో రెండు ఎకరాల భూమిని కేటాయించిందని, ప్రస్తుతం ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని విరమించు కోవాలని డిమాండ్ చేశారు. రైతు బీమా పథకాన్ని కూడా ఎత్తివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రెడ్డి సామాజిక వర్గ సమస్యలు, హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద రాష్ట్ర రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో వేలాది మందితో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి సామాజిక వర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షులు అయిలేని మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్డి సామాజిక వర్గంలోని నిరుపేదలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెడ్డి సామాజిక వర్గ హక్కుల సాధన కోసం అవసరమైనన్ని పోరాటాలు చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో జరిగే నిరసన దీక్షకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెడ్డి జేఏసీ గౌరవ అధ్యక్షులు మా రెడ్డి రాంలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పన్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ముక్కిస తిరుపతిరెడ్డి, దుర్గారెడ్డి, ఇర్రి ఉమారెడ్డి, చల్లారం పద్మారెడ్డి, వంగ శైలజారెడ్డి, గూడ పద్మారెడ్డి, పాతూరి వెంకట్‌రెడ్డి, పార్థివరెడ్డి, సంతోష్‌రెడ్డి, రాంరెడ్డి, రాజిరెడ్డి, అయిలేని గాల్‌రెడ్డి, లింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గూడ బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి-జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

- వంటగది, గురుకుల ప్రాంగణంలో పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29 :**

విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గురుకుల పాఠశాల వంటగది, ప్రాంగణంలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి గురుకుల ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. శనివారం మిరుదొడ్డి మండలం ఆల్వాల గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన తయారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన అన్నం, పప్పు, బెండకాయ కూర, రసం, పెరుగు తదితరాలను పరిశీలించిన కలెక్టర్ కూర నాణ్యతను మరింత మెరుగుపరచాలని సూచించారు. సాధారణ ఆహార మెనూ ప్రకారం గుడ్డు ఎందుకు అందించలేదని వంట సిబ్బందిని ప్రశ్నించగా, సాయంత్రం గుడ్డు బజ్జీ అందించేందుకు గుడ్లు ఉడకబెడుతున్నట్లు వారు తెలిపారు. కూరగాయలను కూడా మంచి నాణ్యత కలిగినవే వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని స్పష్టం చేశారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వంట పూర్తయిన వెంటనే వంటగదిని శుభ్రం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల వద్దకు వెళ్లి వారితో కలెక్టర్ ముచ్చటించారు. భోజనం రుచిగా ఉ ంటుందా.. రోజువారీ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచిగా ఉ ంటోందని, మెనూ ప్రకారమే ఆహారం అందిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరుచుకోవాలని సూచించిన కలెక్టర్, ఆహారాన్ని బాగా నమిలి తినాలని, అన్నాన్ని వృథా చేయకూడదని చెప్పారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆహారానికి విలువనిచ్చి వృథా చేయకుండా తినాలని విద్యార్థులకు సూచించారు.

# కరీంపేటలో పౌర హక్కుల దినోత్సవం



**శంకరపట్నం ఆగస్టు : 29 పీపుల్స్ డైరీ:** శంకరపట్నం మండలం కరీంపేట లో శనివారం రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎగ్గని శ్రీలత అధ్యక్షతన, అధికారులు, నాయకులు మాట్లాడారు. కులమతాలకు అతీతంగా అందరూ సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. అంటరానితనం అసమానతలు లేకుండా మానవులంతా ఒకటే అనే విధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం లో తహసిల్దార్ కే. సురేఖ, ఆర్ ఐ రాములు, అంబేద్కర్ సంఘం నాయకులు, ఉప సర్పంచ్ రాజేశం, రమేష్, వివిధ సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్లు దరఖాస్తు ఈనెల 31 వరకే

**అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి**



**సైదాపూర్ ఆగస్టు 29 ( పీపుల్స్ డైరీ) :** సైదాపూర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో గల అర్హులైన చేయూత 7 రకాల సామాజిక భద్రత పెన్షన్లు మంజూరు కి దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31. 8.2026 చివరి తేదీ గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున ఇట్టి అంశము పై మండల పరిషత్ కార్యాలయంలో మండల గౌరవ సర్పంచులు రాజేందర్ రెడ్డి చంద్రయ్య రజినీకాంత్ సప్న భబిత లావణ్య విజయలక్ష్మి స్వప్న రజిత రమేష్ రవీందర్ సునీత చిరంజీవి భాగ్యలక్ష్మి గోపాల్ శ్రీకాంత్ మరియు పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశంనిర్వహించడం జరిగింది ఇట్టి సమావేశానికి ఎంపీడీవో ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ శ్రీనివాస్ ఎంపివో బషీరుద్దీన్ ఐకెపి ఎపిఎం తిరుపతి, ఏపీఓ రాణి, మొదలగు వారు పాల్గొన్నారు...

# కారు డీ ఒకరికి తీవ్ర గాయాలు..



**రేగొండ ఆగస్టు 29 పీపుల్స్ డైరీ..** రేగొండ మండలం రూపిరెడ్డి పల్లి బస్టాండ్ వద్ద కార్ డీ కొని ఒకరికి తీవ్ర గాయలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రూపిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన మోతె తిరుపతి రెడ్డి అనే వేక్తి వేక్తిగత పనుల నిమిత్తం బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో భూపాలపల్లి నుండి అతి వేగంగా వస్తున్న కారు డీ కొనడంతో రెండు కాళ్లు వీరిగి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108 కి సమాచారం అందించగా పరకాల ప్రభుత్వ హాస్పిటల్ తరలించారు..

# ముందస్తు వైద్య పరీక్షలతో వ్యాధులను తొలిదశలోనే గుర్తించవచ్చు

**సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29:** ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధులను తొలిదశలోనే గుర్తించి, సరైన సమయంలో చికిత్స పొందడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించు కోవచ్చని నివా బుపా ఆరోగ్య బీమా సంస్థ సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ సోమవారం సిద్దిపేట పట్టణంలోని నివా బుపా ఆరోగ్య బీమా కార్యాలయంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో వివిధ రకాల రక్త, మూత్ర పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. సిద్దిపేట పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్‌పై ఉన్న నివా బుపా ఆరోగ్య బీమా కార్యాలయంలో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో నివా బుపా సిబ్బంది సామ్యూల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 29:** గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని సిద్దిపేట నియోజకవర్గం లక్ష్మీదేవిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు పాటలు, పద్యాలు, ఉపన్యాసాలు, కవితా పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయులు పిన్నిటి మహేంద్రారెడ్డి కథల పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని చాటుతూ తమ ప్రతిభను ప్రదర్శించారు. తెలుగు భాషను పరిరక్షించడంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



# పురుషాధిక్యతపై తాప్సీ ఊహించని కామెంట్స్

మంచు మనోజ్ ప్రధాన పాత్రలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఝుమ్మంది నాదం అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది తాప్సీ. ఆ తర్వాత ఒక్కో సినిమా చేస్తూ ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేసింది కానీ స్టార్ హీరోయిన్ హోదా లభించలేదు. దీంతో బాలీవుడ్ కి మకాం మార్చింది ఈ ముద్దుగుమ్మ. అక్కడే పలు సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్న తాప్సీ తాజాగా హిందీలో నటిస్తున్న లేడీ ఓరియంటెడ్ మూవీ గాంధారి. అంధురాలైన తల్లిపాత్రలో తాప్సి నటిస్తోంది . కిడ్నాప్ కి గురైన తన కూతుర్ని కాపాడుకోవడానికి ఒక తల్లి ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంది? చైల్డ్ ట్రాఫికింగ్ , మాఫియా పై ఎలాంటి పోరాటం సాగించింది? అనే కోణంలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సెప్టెంబర్ 3న నేరుగా ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఒకవైపు సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మరొకవైపు వరుస ప్రమోషన్స్ లో పాల్గొన్న తాప్సీ తాను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంది ? పురుషాధిక్యత ప్రభావం ఇండస్ట్రీపై ఎలా ఉంది? ముఖ్యంగా తాను నటించిన తొలి సినిమా సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు ఏంటి? ఇలా ప్రతి విషయాన్ని కూడా ఆమె పంచుకున్నారు. తాప్సీ పన్ను మాట్లాడుతూ.." నేను నా మొదటి సినిమాకు సంతకం చేశాను.. అయితే సినిమా షూటింగ్ ప్రారంభించినప్పుడు సెట్లో నేనొక్కదాన్నే మహిళ. అక్కడికి వెళ్ళగానే సెట్లో ఒక మూలకి ఒక ప్లాస్టిక్ కుర్చీ వేసారు. ఆ సమయంలో నాకు వ్యక్తిగత సిబ్బంది ఎవరూ లేకపోవడంతో నిర్మాత కేటాయించిన ఒక స్పాట్ బాయ్ మాత్రమే నాతో ఉండేవాడు. ముఖ్యంగా నా దగ్గరకు వచ్చి మాట్లాడడానికి, నాతో కూర్చోవడానికి ఎవరు ఇష్టపడలేదు. నేను ఒక కొత్త నటిని. మొదట్లో ఏ సినిమా సెట్ లో అయినా సరే ఇలాగా ఉంటుందా అనుకున్నాను. ముఖ్యంగా షూటింగ్ సమయంలో నేను నేలపై పడుకుని ప్రదర్శన ఇచ్చే సమయంలో కొన్ని విచిత్రమైన పరిస్థితులు కూడా ఎదుర్కొన్నాను. షూటింగ్ సమయంలో ఒక ట్రాలీపై ఫోకస్ పుల్లర్ అలాగే కెమెరామెన్ కూర్చొని ఉంటారు. వాళ్లు తమ శరీరంపై అక్కడక్కడ గోకుతూ కనిపించడం చూసి నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. నేను నటిస్తున్న సమయంలో నిజంగానే నేను ఇంత తక్కువా అని అనుమానం కలిగింది. చాలా తక్కువ చేసి మాట్లాడారు. నాకు ఇలాంటి అనుభవాలు, విచిత్రమైన సంఘటనలు ఎన్నో ఎదురయ్యాయి.



# బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్

ప్రస్తుతం సమంత తల్లికాబోతున్న ఆనందంలో ఉన్నారు. ఒకవైపు బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్.. మరోవైపు వ్యాయామం చేస్తూ అభిమానులతో ఫొటోలు పంచుకుంటున్నారు. తాజాగా ఇన్‌స్టా వేదికగా ఫ్యాన్స్‌తో ముచ్చటించారు. కొందరు తల్లులు ఆమెకు సలహాలు ఇవ్వగా.. మరికొందరు ఆమెతో వారి అనుభవాలు పంచుకున్నారు. బేబీ కోసం కావాల్సిన వస్తువులన్నీ కొన్నాను. వాటిని చూస్తుంటే కాస్త కంగారుగా ఉంది. అందుకే ప్రస్తుతానికి వాటిని ప్యాక్ చేసి ఆ బ్యాగ్‌ను ఒక లాప్‌టాప్ స్టాండ్‌గా వాడుతున్నానన్నారు. ప్రెగ్నెన్సీతో ఉన్నప్పటి నుంచి నాకు కలలు వస్తున్నాయి. మీకు కూడా వస్తున్నాయా అంటూ ప్రశ్నలు వేస్తున్నారు. నిజంగానే.. ఈ విచిత్రమైన కలల గోల ఏంటో అర్థం కావట్లేదు. మరోవైపు11 కేజీలు పెరిగానన్నారు. కొత్తగా తల్లి అయిన తర్వాత చాలా మార్పులు వస్తాయట. నేను ఆ క్షణాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. పుట్టినవారికి పాలు పట్టడం, జోలపాడి నిద్రపోయేలా చేయడం.. ఈ పనులు ఫుల్ టైమ్ జాబ్‌లా మారిపోతాయి. అది చాలా అందమైన, గొప్ప అనుభూతి. జీవితాన్ని మార్చే అనుభవం. మాతృత్వం ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది. మాతృత్వం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఇప్పటి వరకు తెలియదు. నేను ఊహించలేదు కూడా. మంచి విషయాన్ని తెలిపారు. ధన్యవాదాలు అంటున్నారు. పుట్టబోయే బిడ్డకు ఏం పేరు పెడతారంటే ..ఓ పేరును ఎంచుకోవడం చాలా కష్టం.. దీనికి మీ అందరి సహాయం కావాలి. స్కానింగ్ రిపోర్ట్స్ వచ్చేదాక చాలా టెన్షన్‌గా ఉంటుంది. అయితే ఈ కొత్త దశను  పూర్తిగా ఆస్వాదిస్తున్నానని సమంత ఆనందంగా చెప్పారు.



# ప్యారడైజ్ నుంచి యెష నాగుల కట్టమీద పాట విడుదల



నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను అందించారు. ఈ చిత్రం నుంచి రెండో సింగిల్‌గా మోస్ట్ పాపులర్ ఫోక్ సాంగ్ అయిన 'యెష నాగుల కట్ట మీద' పాటను డిజిటల్ వేదికగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబింబించేలా సాగే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ వైబ్‌తో రీమిక్స్ వెర్షన్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సోషల్ మీడియాలోనూ, ప్రజల నోళ్లలోనూ నానుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన రాకింగ్ మాస్ బీట్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నానితో పాటు తెరపై ఈ పాటకు రాబోయే మాస్ స్టెప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చుతున్నాయి. ఈ క్యాచీ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా, జంగి రెడ్డి మరియు సింగర్ ప్రభ తమ శక్తివంతమైన గాత్రంతో ప్రాణం పోశారు. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# దీపిక మాటలు కాదు.. చేతల్లో చూపించాలి

తాను ప్రభాస్ కంటే ఎక్కువ సినిమాలు చేశానని.. తన కంటే ఎక్కువ సక్సెస్ ఫుల్ అన్నట్లుగా దీపికా పదుకొనే ఇటీవల ఒక కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారమే రేపుతున్నాయి. వేరే హీరో అంటే ఏమో కానీ.. దేశవ్యాప్తంగా తిరుగులేని అభిమానాన్ని సంపాదించుకుని ఇండియాలో బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా అవతరించిన ప్రభాస్‌ను.. వివాదాలకు దూరంగా ఉంటూ, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే హీరో మీద పరోక్షంగా తన అక్కసు వెళ్లగక్కడం.. తనతో పోటీ పెట్టుకుని మాట్లాడ్డం.. అతణ్ని కించపరిచేలా మాట్లాడ్డం తెలుగు వాళ్లకే కాదు.. ఇతర భాషల వాళ్లకు కూడా నచ్చట్లేదు. ఎప్పుడూ వివాదాలతో సహవాసం చేసే దీపికకు ముందు నుంచే సోషల్ మీడియాలో హేటర్స్ ఎక్కువ. తాజా వ్యాఖ్యలతో ఆమె మీద వ్యతిరేకత మరింత పెరిగిపోతోంది. దీపిక పాస్ట్ ఎఫైర్ల దగ్గర్నుంచి.. వివిధ సందర్భాల్లో ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోల వరకు తీసుకొచ్చి ఆమెను ట్రోల్ చేస్తున్నారు. ఇదంతా పక్కన పెడితే.. ప్రభాస్ కంటే తాను పెద్ద స్టార్ అన్నట్లు చెప్పుకుంటూ తనకు దీటుగా పారితోషకం డిమాండ్ చేస్తున్న దీపికకు నెటిజన్లు ఒక సలహా ఇస్తున్నారు. నిజంగా దీపిక అంత పెద్ద స్టార్, తనకు భారీ మార్కెట్ ఉ ందని నమ్ముతున్నట్లయితే.. మేల్ సూపర్ స్టార్లతో కలిసి చేసే సినిమాల్లో వారితో పోటీ పెట్టుకునే బదులు ఒక లేడీ ఓరియెంటెడ్ మూవీ చేసి తన బాక్సాఫీస్ స్టామినా ఎంతో రుజువు చేయాలని అంటున్నారు. తనే లీడ్ రోల్ చేసిన సినిమాతో తాను ఎన్ని వందల కోట్లు రాబట్టగలదో చూపిస్తే.. ఆమె ఫాలోయింగ్, మార్కెట్ ఎంత అన్నది అందరికీ అర్థమవుతుంది కదా అని అభిప్రాయపడుతున్నారు. చివరగా దీపిక నటించిన లేడీ ఓరియెంటెడ్ మూవీ 'చప్పక్' అయితే రూ.50 కోట్లకు అటు ఇటుగా వసూళ్లు రాబట్టింది. అది 2020లో రిలీజైన సినిమా. పైగా అదొక ప్రయోగాత్మక చిత్రం. ఇప్పటికి దీపిక మార్కెట్ ఇంకా పెరిగి ఉ ంటుంది కాబట్టి.. ఇప్పుడు ఒక యాక్షన్ టచ్ ఉన్న లేడీ ఓరియెంటెడ్ సినిమా చేసి దీపిక తన స్టామినా ఏంటో చూపించాలి. ఆ సినిమా ప్రభాస్ చిత్రాల్లాగే వందలు, వేల కోట్ల వసూళ్లు రాబడితే.. అందుకు తగ్గట్లే పారితోషకం కోసం డిమాండ్ చేయొచ్చు. ప్రభాస్ కంటే తానే పెద్ద స్టార్, సక్సెస్ ఫుల్ అని బల్లగుద్ది చెప్పొచ్చు.



## ఉద్యమకారుడి కుటుంబాన్ని పరామర్శించిన నాగుర్ల

**ఆత్మకూరు, ఆగస్టు 29(పీపుల్స్ డైరీ) :** మండలంలోని నీరుకుల్లా గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మానగాని రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్రావు బాధిత కుటుంబాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. ఉద్యమకారులను, వారి కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని,ఎలాంటి అవసరం వచ్చినా అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం,మండల అధ్యక్షుడు ఎండీ బాబుమియా (చిరు), నీరుకుల్ల గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు వంగేటి వేణు, ఉద్యమకారుల అధ్యక్షుడు పసుల లక్ష్మీనారాయణ,మండల ప్రధాన కార్యదర్శి దొంక దువ్వ రాజన్న,పెంచికల పేటకు చెందిన ఉద్యమకారుడు, మాజీ సర్పంచ్ చిట్టే రవి,ఆత్మకూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు భాషబోయిన సాగర్, కిన్నెర రాజేందర్,ఉడుత శశికుమార్, భాస్కర్,వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకు సన్మానం



**నల్లబెల్లి, డిసెంబర్ 29 (పీపుల్స్ డైరీ) :** నల్లబెల్లి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పింగిలి రమణారెడ్డిని నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువా కప్పి, పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి, సామాజిక ఉద్యమ నేత బట్టు సాంబయ్య, ఎమ్మార్పీఎస్ మండల కమిటీ మాజీ అధ్యక్షుడు, 'దళిత రత్న' అవార్డు గ్రహీత పరికిరత్నం మాదిగ మాట్లాడారు. గత ఐదు నెలలుగా నల్లబెల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో, నర్సంపేట ఎంపీడీవోను ఇన్‌ఛార్జిగా నియమించారని తెలిపారు. దీనివల్ల మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. రెగ్యులర్ ఎంపీడీవోను నియమించాలని జిల్లా కలెక్టర్‌కు అనేకమార్లు విజ్ఞాపన పత్రాలు సమర్పించామని, స్పందించి నూతన ఎంపీడీవోను నియమించిన గౌరవ జిల్లా కలెక్టర్ సత్య శారదకు ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నారక్కపేట గ్రామ సర్పంచ్ దండం సంపత్, రంగాపురం గ్రామ కార్యదర్శి రామారావు, వికలాంగుల హక్కుల పోరాట సమితి మాజీ మండల అధ్యక్షుడు పులి రమేష్ గౌడ్‌పాల్గొన్నారు.

## రేపటి రైతుల సమావేశానికిహాజరు కావాలి

### రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి



**గోవిందరావుపేట, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధి లక్నవరం చెరువు ఆయకట్టు రైతులు సమావేశం నిర్వహించబడుతుందని రైతు సంఘం ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి తెలిపారు, ప సరరైతు సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో తుమ్మల వెంకటరెడ్డి మాట్లాడుతూ లక్నవరం సరస్సునీటి విడుదల విషయమై ఈనెల 31న మండల కేంద్రంలోని రైతు వేదికలో సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించడం రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంక రెడ్డి తెలిపారు,ఈ సమావేశంలో రైతు కమిటీ ద్వారాభవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించడం జరుగుతోందని ఆయకట్టు రైతులందరూ సకాలంలో హాజరు కావాలని తుమ్మల వెంకట్ రెడ్డి కోరారు,

## రామతీర్థంలో పౌర హక్కుల దినోత్సవం




**నల్లబెల్లి, ఆగస్ట్ 29 (పీపుల్స్ డైరీ) :** నల్లబెల్లి మండలంలోని రామతీర్థం గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సమాజంలో పౌర హక్కులు, సామాజిక సమానత్వం పట్ల ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో భాగంగా మండల స్థాయి అధికారులు గ్రామ ప్రజలతో కలిసి సహపంక్తి భోజనం చేయడం విశేషం. కుల, మత వ్యత్యాసాలను పక్కనబెట్టి అందరూ ఒకే చోట కలిసి భోజనం చేయడం ద్వారా గ్రామంలో ఐక్యతను, సామాజిక సమరస్యతను చాటిచెప్పారు. కార్యక్రమంలో సబ్ ఇన్స్‌పెక్టర్, మండల పరిషత్ అధికారి (, మండల విద్యాశాఖాధికారి, మండల వ్యవసాయ అధికారి, సూపర్‌వైజర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్, వైద్యాధికారి, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, రెవెన్యూ గిర్దావర్, పంచాయతీ కార్యదర్శి తదితర శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అధికారులందరూ ఒకే వేదికపైకి వచ్చి ప్రజలతో మమేకం కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో ఉన్న వివక్షను రూపుమాపి, సమతా భావాన్ని పెంపొందించే దిశగా రామతీర్థం గ్రామం అందరికీ ఆదర్శంగా నిలిచిందని పలువురు ప్రశంసించారు.

## జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహణ

**కేసముద్రం, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేసముద్రంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి.హెచ్. మైసయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. రమేష్ బాబు, స్పోర్ట్స్ ఇన్ చార్జ్ ఎస్. రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ సి.హెచ్. మైసయ్య మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొని తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని నేర్పుతాయని అన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు.

# సెప్టెంబర్ 4న వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**పార్టీలకు అతీతంగా ఉత్సవాలు**

**హనుమకొండ కాళోజీ కళాక్షేత్రం వేదికగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబరాలు**

**యాదవ సంస్కృతీ, సంప్రదాయాలు తెలిపేలా కార్యక్రమాలు**

**యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ వెల్లడి**

**గొల్ల,కురుమల సమక్షంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ**



**హనుమకొండ, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా ప్రముఖులు తరలిరానున్నారని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లోని బీసీ భవన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గొల్ల, కురుమలతో కలిసి సుందర్ రాజ్ యాదవ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈసారి కూడా అత్యంత వైభంగా ఉత్సవాలు జరుపుతామన్నారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా శ్రీకృష్ణుని భజనలు జరుగుతు న్నాయని, భగవద్గీత ప్రపంచానికే మార్గదర్శిగా మారిందని గుర్తు చేశారు. సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా యాదవుల సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యుడు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పార్టీలకు అతీతంగా హాజరవుతారన్నారు. ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 4న మధ్యాహ్నం రెండు గంటలకు రాంనగర్ లోని బీసీ భవన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు రథ యాత్ర జరుగుతుందని, అనంతరం పవిత్రమైన గోపూజ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఆ తరువాత శ్రీకృష్ణ భగవానుడికి తొట్లు ఊపే కార్యక్రమం ఉంటుందని, యాదవ సంస్కృతికి అద్దం పట్టేలా సంబరాలు జరుగుతాయన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే కళాకారులతో ఆటాపాట, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయ న్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యాదవులను ఏకం చేసి రాబోయే రోజుల్లో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని సుందర్ రాజ్ యాదవ్ వివరిం చారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు...ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, తోట్ల రాజు యాదవ్, యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రవీంద్ర కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు కత్తుల సహదేవ్ యాదవ్, కార్యదర్శి తుత్తురు రవీందర్ యాదవ్, కోశాధికారి చిన్నాల రవీందర్ యాదవ్, అఖిలభారత యాదవ మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొల్లెబోయిన కిషోర్ యాదవ్,అఖిలభారత యాదవ మహాసభ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ముగలా కుమార్ యాదవ్, యాదవ మహిళ నాయకురాలు లలిత యాదవ్,కనకరాజు యాదవ్, ఇదుల మల్లయ్య యాదవ్ దూడయ్య యాదవ్, చెన్నమల్లు యాదవ్, పెద్దబోయిన నాగరాజు, ప్రమోద్ యాదవ్, యుగేశీధర్ యాదవ్ వంశీ యాదవ్ , కోటి యాదవ్,కందుల జీవన్ యాదవ్,రమేష్ యాదవ్, హరి ప్రసాద్ యాదవ్, రాణా యాదవ్, పోతరబోయిన రాజయ్య, యశ్వంత్ యాదవ్, నన్నెబోయిన రాజ్ యాదవ్, వేల్పుల సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### వరంగల్ చౌరస్తాలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన దీక్ష



**మట్టెవాడ, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు పిలుపు మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా వరంగల్ చౌరస్తాలో బీజేవైఎం వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిరసన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా గంట రవి మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.15 వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు అంధకారంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు. కనీసం విద్యాశాఖ మంత్రి కూడా లేని ఏకైక దుస్థితి ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఉందంటూ ఆయన దుయ్యబట్టారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని పక్షంలో ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేసే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన వివాదాస్పద జీవో 97 వల్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు, ఈసెట్ రాసే విద్యార్థుల భవిష్యత్తు తీవ్ర ఆందోళనలో పడిందని మండిపడ్డారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనపరుస్తోందని ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, బీజేపీ నాయకులు ఆదెపు రవిరాము, రాళ్లబండి మున్నా, మహంత్, బాశెట్టి సాయి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, బైరి నాగరాజు, కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, బైరి శ్యాంసుందర్, రాయపురం కుమారస్వామి, పోనుగోటి వెంకట్ రావు,అంకాల జనార్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు టేకుమట్ల రేణుక, మాదాసు రాజు, కూచన క్రాంతి కుమార్, దండు కిషన్, కర్నె రవీందర్, మెంతుల యాదగిరి, మార్తా ఉషారాణి, జీలకర్ర వీరస్వామి, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాయంపేట క్లస్టర్ ఏఈవోగా నందిపాక పూజ

**శాయంపేట, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** శాయంపేట మండలంలోని శాయంపేట క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిగా (ఏ ఈ వో) నందిపాక పూజ నూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏ ఈ వో నందిపాక పూజ మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలోని రైతులకు అవసరమైన వ్యవసాయ సాంకేతిక సూచనలు, పంటల సాగు, పురుగు--తెగుళ్ల నివారణ, ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై అవగాహన తదితర సేవలను అందించేందుకు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ సమస్యలు, సందేహాల కోసం వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి, వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.



# పన్నుల వసూళ్లలో వేగం పెంచండి!

### బకాయిల వసూళ్లకు కఠిన చర్యలు తీసుకోండి - బల్దియా కమిషనర్ వెంకన్న

**మట్టెవాడ, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్లకు నిర్దేశించిన లక్ష్యాల సాధనలో మరింత వేగం పెంచాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ట్యాక్సేషన్, రెవెన్యూ అధికారులతో ఆయన సర్కిల్‌ల వారీగా పన్నుల వసూళ్ల పురోగతిని సమీక్షించారు. ఆస్తి పన్నుల వసూళ్లు, కొత్త నిర్మాణాల గుర్తింపు, ప్రభుత్వ భవనాల రీ-అసెస్‌మెంట్, కమర్షియల్, నాన్ కమర్షియల్ భవనాల పన్నుల విధింపు, ఆన్ కలెక్టబుల్ డిమాండ్లు, డబుల్ అసెస్‌మెంట్లు, వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (విఎల్.టి), ప్రాపర్టీ రివిజన్ తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. పన్నుల వసూళ్ల లక్ష్యాలను సర్కిల్, వార్డు స్థాయిలో విభజించి, రోజువారీ పురోగతిని తప్పనిసరిగా పర్యవేక్షించాలని సూచించారు. కొత్త అసెస్‌మెంట్లు, పెండింగ్ బకాయిలు, వీఎల్‌టీ, డబుల్ అసెస్‌మెంట్లు, కమర్షియల్ భవనాల గుర్తింపు తదితర అంశాలపై రెవెన్యూ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. పన్నుల అసెస్‌మెంట్, వసూళ్ల ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం డిస్మాంటిల్ చేసిన భవనాలకు సంబంధించిన పాత హౌస్ నెంబర్లను గుర్తించి పూర్తి వివరాలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఈ వివరాలను ఉప కమిషనర్లు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, తుది నివేదికను సమర్పించాలని సూచించారు. పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు ఉన్న డిఫాల్టర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్లకు ఆర్ఆర్ చట్టం ప్రకారం చర్యలు చేపట్టేందుకు వివరాలను సమర్పించాలని తెలిపారు. నగర పరిధిలోని ప్రతి ప్లాట్‌ను గుర్తించి నిబంధనల ప్రకారం వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ వసూలు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. పన్నుల వసూళ్లలో వెనుకబడిన



సర్కిళ్లు, వార్డులను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన చోట్ల ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో పర్యటించి బకాయిలను సేకరించాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్య సాధన దిశగా సిబ్బందిని సమన్వయం చేయాలని ఆదేశించారు. పన్ను వసూళ్లలో వృద్ధిని పెంచడానికి త్వరలోనే వార్డు ఆఫీసర్‌లు, బిల్ కలెక్టర్‌లు, రెవెన్యూ అధికారులతో సమన్వయం సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆస్తి పన్నుతో సమాంతరంగా నీటి పన్ను బకాయిలపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు బిర్రు శ్రీనివాస్, ప్రసన్నరాణి, ట్యాక్సేషన్ అధికారి రామకృష్ణ, ఐటీ మేనేజర్ రమేష్, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## వసంతరాణి అంతిమయాత్రలో పాల్గొన్న కొమురయ్య

**చిట్యాల, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రీతం నాగరిగారి తల్లి నాగరిగారి వసంతరాణి శుక్రవారం మృతి చెందారు. ఆమె పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ చిట్యాల మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమరయ్య శనివారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. హైదరాబాద్ చెంగిచెర్లలో జరిగిన ఆమె అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడికి పరామర్శ



**చిట్యాల, ఆగస్టు 29(పీపుల్స్ డైరీ) :** ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు రామ్ రాంచందర్ మాదిగ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా అతనిని టేకుమట్ల మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్చార్జి మడిపల్లి శ్యాం బాబు మాదిగ రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి మాదిగ శనివారం పరామర్శించారు. వైద్యుల సూచన మేరకు మందులు సరిగా వాడి తొందరగా నయం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దోర్నాల రాజేందర్ మాదిగ ఎమ్మెస్ఎఫ్ మండల నాయకులు మచ్చ శ్రీకాంత్ మాదిగ ఎమ్మెస్పి మండల సీనియర్ నాయకులు ఎల్కటి రాజయ్య మాదిగ ఉన్నారు.

## ఉచిత బైక్ మెకానిక్ శిక్షణ



**చిట్యాల, ఆగస్టు 29(పీపుల్స్ డైరీ) :**వరంగల్‌లో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా 51 రోజుల పాటు ఎలక్ట్రిక్ బైక్ మెకానిక్ (ఎలక్ట్రిక్ బైక్ పెట్రోల్ (బీఎస్ 6) లో శిక్షణ ఇచ్చి తర్వాత జాబ్ అవకాశం కల్పిస్తామని ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోఆర్డినేటర్ బాబు మైస శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కాలము అనంతరం ఎన్ఎస్డిసి సర్టిఫికెట్ ఇవ్వబడుతుంద న్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా హాస్టల్ వసతి భోజనం ఉంటుందని శిక్షణలో చేరేందుకు కనీస విద్యార్హత టెన్త్ / ఇంటర్ / ఐటీఐ / డిప్లొమా/ డిగ్రీ/పీజీ/ పాస్/ఫెయిల్ వయస్సు 18 -- 30 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యా యని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఇతర వివరాలకు 9014697041 ఈ ఫోన్ నెంబర్లో సంప్రదించాలని ఆయన కోరారు.

## డిజిటల్ క్రాప్ సర్వే పంట వివరాలను నమోదు చేసుకోవాలి

### ఏఓ హరి ప్రసాద్ బాబు



**గీసుకొండ, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** మండలంలో డిజిటల్ క్రాప్ సర్వే డిసిఎస్ పనులు శీఘ్రంగా జరుగుతున్నాయని మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా మాచాపూర్, మొగిలిచర్ల గ్రామాల్లో జరుగుతున్న క్రాప్ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, పంట నష్టపరిహారం మద్దతు ధరల ప్రయోజనాలు సకాలంలో అందాలంటే ప్రతి ఒక్క రైతు తమ పంట వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ) వద్ద తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. గీసుగొండ మండలంలో ఈ సర్వే కొరకు మొత్తం 31,327 ప్లాట్లు కేటాయించగా, ఇప్పటివరకు 814 ప్లాట్ల సర్వే (2.6%) పూర్తయిందని తెలిపారు. ప్రస్తుతం మొగిలిచర్ల (21.2%), వంచనగిరి (7.6%), బొడ్డుచింతలపల్లె (3.3%) గ్రామాల్లో సర్వే పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని వివరించారు. మండలంలో సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు రైతులందరూ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో ఏఈఓ బల్లు భరత్, డీసీఎస్ సర్వేయర్ అచ్చ వర్షిత్ తో పాటు స్థానిక రైతులు ఎద్దు శ్రీను, పత్తిపాక నారాయణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతా!

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**గణపురం, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం గణపురం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడంతోపాటు అప్పయ్యపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో వీవో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చెల్పూర్ గ్రామపంచాయతీ ఆవరణలో (చెల్పూర్, గొల్లపల్లి), ధర్మారావుపేటలో (బసరాజ్‌పల్లి, పరశురాంపల్లి, ధర్మారావుపేట, వెంకటేశ్వర్లపల్లి, నగరంపల్లి), సీతారాంపూర్‌లో (కొండాపూర్, సీతారాంపూర్, అప్పాయిపల్లి), గణపురంలో (గణపురం, బురకాయలగూడెం), గాంధీనగర్‌లో (గాంధీనగర్, మైలారం, లక్ష్మారెడ్డిపల్లి) గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హత ఉన్న ప్రతి





పేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నో ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్డులు మంజూరు చేసి అండగా నిలుస్తోందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు, రైతులు, పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ అడ్లూరి రాజేశ్వర్ రావు, ఎంపీడీవో శ్రీకాంత్, సొసైటీ చైర్మన్ కన్నెబోయిన కుమార్ యాదవ్, మండల కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు తాళ్ళపెల్లి భాస్కర్ రావు, ఆయా గ్రామాల సర్పంచ్ లు కావటి రజిత రవీందర్, కటుకూరి రాధిక శ్రీనివాస్, ఉడిగే అరుణ్ కుమార్, పూజారి రాజేందర్, ఉడుత సాంబయ్య యాదవ్, మొకిడి నాగరాజు, కొడారి హైమావతి ధనుంజయ్, ఎలుకపెల్లి రమేష్, తోట రాకేష్, ఇంజపెల్లి శ్రీనివాస్, సంపత్ రెడ్డి, అంబాల లక్ష్మి, భూక్య సమ్మయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కటుకూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్‌లు ఓరుగంటి కృష్ణ, పొనగంటి మలహాల్‌రావు,గండు శ్రీను, నాయకులు విడిదినేని అశోక్, చింతకుంట్ల శ్రీనివాస్, దూలం కుమారస్వామి, కొత్త వెంకన్న లక్కం రాములు సూరినేని సంపత్ రావు, మార్నేని ఉపేందర్ రావు, బొల్లెద్ల ప్రభాకర్ రెడ్డి, కాంతాల సమ్మిరెడ్డి, ముత్యాల రాజయ్య దూడపాక శంకర్, వెంపటి భువన సుందర్ పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం : ఎమ్మెల్యే గండ్ర



**చిట్యాల, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి నియోజకవర్గంలోని టేకుమట్ల మండలంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రాఘవపూర్ రామకృష్ణాపూర్(వి) వెలిశాల ఆసిరెడ్డిపల్లి టేకుమట్ల గుమ్మడవెల్లి వెల్లంపల్లి గ్రామాల్లో మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం గరిమిళ్లపల్లి వెంకట్రావుపల్లి బి వెలిశాల టేకుమట్ల రైతు వేదిక లో వెల్లంపల్లి గ్రామాల్లో వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అర్హులైన ప్రజలకు రేషన్ కార్డులు అందించడంలో విఫలమైందని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందించడంతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ చేపడుతోందని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా మహిళా సంఘాలకు జీరో వడ్డీ రుణాలు మహిళా సంఘ భవనాలు అంగన్వాడీ భవనాల నిర్మాణం స్వయం ఉపాధి మరియు ఉత్పత్తి సంఘాల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమం మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు మహిళా సంఘాల అధ్యక్షురాలుస్మార్ట్ రేషన్ కార్డు లబ్ధిదారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే మురళి నాయక్ సమీక్ష



**మహబూబాబాద్, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతులు, పెండింగ్ లో ఉన్న పనులు, నూతన రహదారుల నిర్మాణంపై మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ ఈఈ, ఆర్ అండ్ బీ ఈఈతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై నియోజకవర్గంలోని రహదారుల పరిస్థితిపై సమగ్రంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగుపరచడంపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించారు. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారి నిర్మాణం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామాలకు కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. అవసరమైన చోట్ల హై లెవల్ వంతెనలు, కల్వర్టులు, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. వర్షాకాలంలో రోడ్లు దెబ్బతినకుండా, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యమని, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడే పరిస్థితి లేకుండా అవసరమైన ప్రతి ప్రాంతానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి నిధులు తీసుకువస్తామని ఎమ్మెల్యే మురళి నాయక్ తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ శాఖల అధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి ఆలయ భూమిపూజకు నేతలకు ఆహ్వానం



**గణపురం, ఆగస్టు (పీపుల్స్ డైరీ) :** మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో నిర్మించనున్న పెద్దమ్మతల్లి ఆలయ భూమిపూజ కార్యక్రమానికి పలువురు ముదిరాజ్ సంఘం, రాజకీయ నాయకులను ఆలయ కమిటీ అధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా శాసనమండలి వైస్‌చైర్మన్, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ముదిరాజ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల కీర్తిరెడ్డి సత్యపాల్‌రెడ్డి, మెపా వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్, మెపా రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావుల జగదీశ్వర ప్రసాద్ ముదిరాజ్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, ములుగు జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఎర్ల వెంకన్న ముదిరా జ్, మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరటి రాజు ముదిరాజ్‌లను కలిసి భూమిపూజ కార్యక్రమానికి హాజరు కావాలని కోరినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం చేపట్టనున్న భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు సాదు కరుణాకర్, సహాయ కార్యదర్శి ఆకుల రాజ కుమార్, మాజీ ఉప సర్పంచ్ ఊరడి రాజయ్య, కమిటీ సభ్యులు ఆకుల రాకేష్ పాల్గొన్నారు.



## విద్యార్థులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది

### గ్రామ సర్పంచ్ గాదం శ్రీవాణి రమేష్

**మొగుళ్ళపల్లి, ఆగష్టు (పీపుల్స్ డైరీ) :** మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివే విద్యార్థిని, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతిస్తూ ప్రోత్సహిస్తుందని సర్పంచ్ గాదం శ్రీవాణి రమేష్ ఉప సర్పంచ్ నీల రాజు అన్నారు. శనివారం ములుకలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు సరఫరా చేసిన షూసులను, సాక్స్ లను గ్రామ సర్పంచ్. గాదం శ్రీవాణి రమేష్, ఉప సర్పంచ్ నీల రాజు కురుమ పంపిణి చేసి మాట్లాడుతూ. ప్రభుత్వం అందించే ప్రతిదీ విద్యార్థిని విద్యార్థులకు సకాలంలో అందజేయడమే కాకుండా ఎల్లవేళలా పాఠశాలకు సహయా సహకారాలు అందించడంలో ముందుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసునూటి రాము, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కస్తూరి లక్ష్మీ, ఉపాధ్యాయినిలు మీనాక్షి, సృజన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం




**మొగుళ్ళపల్లి, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా. ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు ఎం. రాజు, పాఠశాల పిడి గుండెల్లి రాజయ్య ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల పిడి గుండెల్లి రాజయ్య మాట్లాడుతూ భారతదేశం క్రీడలకు పుట్టినిల్లు ముఖ్యంగా కబడ్డీ ఖో -ఖో, వాలీబాల్ , క్రికెట్ , హాకీ అంటే భారతీయులకు ఎంతో ఇష్టమని. క్రికెట్ అనగానే సచిన్ టెండూల్కర్, పరుగు పందెం అనగానే పిటి ఉష, హాకీ అనగానే మేజర్ ధ్యాన్ చంద్ అన్నారు. హాకీ అనగానే గుర్తుకు వచ్చే ఏకైక ఆటగాడిగా ధ్యాన్ చంద్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటామని, మేజర్ హాకీ మాంత్రికుడు, విజాడ్ ఆఫ్ హాకీ, ధ్యాన్ చందు జయంతి సందర్భంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం రాజు, బి.కుమారస్వామి, కె.ప్రవీణ్, పి.లలిత, విజయభాస్కర్, అటెండర్ ఎండి.మజహార్, ఎన్సిసి. విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంజీఎంలో జాతీయ క్రీడా దినోత్సవం

**గణపురం, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో శనివారం మండలంలోని చెల్పూర్ గ్రామంలోని ఎంజీఎం పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల యాజమాన్యం క్రీడాజ్యోతిని వెలిగించి వేడుకలను ప్రారంభించింది. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఆటలు విద్యార్థుల నిత్యజీవితంలో భాగం కావాలని, క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే తత్వం అలవడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ మాట్లాడుతూ... క్రికెట్‌కు పెద్దగా ప్రాధాన్యం లేని రోజుల్లో హాకీ క్రీడ ద్వారా భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, గ్యాదంగి రమాదేవి, సిల్వేరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మధుకర్, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ సర్పంచులు

**చిట్యాల,ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో చిట్యాల మండలంలోని బిఆర్ఎస్ పార్టీకి చెందిన రామచంద్రాపూర్ సర్పంచ్ గాజా హేమలత అశోక్ కైలాపూర్ గ్రామ సర్పంచ్ కోడారి ఓదెలు తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు ఆకర్షితులై వారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పార్టీలు రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దబ్బెట అనిల్ సర్పంచులు కర్రు లక్ష్మీ ప్రతాప్ రెడ్డి నక్క భాస్కర్ గుంటుపల్లి నాగమల్లేశ్వర్ కోడారి అశోక్ పర్లపెల్లి



రవి మాజీ సర్పంచులు చిలుకల రాయకోమురు కామిడి రత్నాకర్ రెడ్డి మన్నెం శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీలు గుర్రపు సునీత తిరుపతి కట్కూరి పద్మ నరేందర్ టౌన్ గ్రామ శాఖ అధ్యక్షులు గంగాదరి రవీందర్ వేముల రాజుకుమార్ కంకణాల శంకర్ ఉపసర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు మద్దన నాగరాజు పార్టీ నాయకులు సిరిపురం కుమారస్వామి సింగిశాల మోహన్ రావు దబ్బెట రవి గాజె శంకరయ్య గాజె జనార్ధన్ అన్న రాజు పాసిగంటి మహేందర్ బుద్దారపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ, ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించాలి

▸ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ ▸ ఆటోనగర్‌లోని బాలుర పరిశీలన గృహం సందర్శన




**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** ఆటో నగర్‌లోని పరిశీలన గృహంలోని బాలల సంక్షేమం, వసతులు... వారికి అందు తున్న సేవలను వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలన గృహంలోని వసతి గదులు, భోజన సదుపాయాలు, తాగునీరు, పారి శుద్ధ్యం, వైద్య సదుపాయాలు, విద్యా మరియు వృత్తి శిక్షణ, కౌన్సెలింగ్ సేవలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బాలలతో నేరు గా మాట్లాడి వారి సమస్యలు, అవసరా లు మరియు వారికి అందుతున్న సదు పాయాల గురించి అడిగి తెలుసుకున్నా రు. బాలలతో స్నేహపూర్వకంగా మాట్లా డి, వారి భవిష్యత్తుపై సానుకూల దృక్ప థంతో ముందుకు సాగాలని సూచించారు.

బాలల హక్కుల పరిరక్షణ, ఉచిత న్యాయ సహాయంపై వారికి అవగాహన కల్పించాలని సూపరింటెండెంట్ శ్రీదేవికి సూచనలు చేశారు. బాలలకు అవసరమైన విద్య, ఆరోగ్యం, మానసిక సహాయం, నైపుణ్యాభివృద్ధి మరియు సామాజిక పునరావాసం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పరిశీలన గృహంలో రికార్డుల నిర్వహణ, బాలలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలన గృహంలో నిర్వహించాల్సిన అన్ని రికార్డులు, రిజిస్టర్లు మరియు బాలలకు సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో, ఎప్పటికప్పుడు నవీకరిస్తూ సక్రమంగా నిర్వహించాలని సూపరింటెండెంట్ ను ఆదేశించారు.

రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం, లోపాలు లేదా జాప్యానికి తావు ఉండకూడదని హెచ్చరించారు. బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేసి, సంబంధిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అదేవిధంగా పరిశీలన గృహంలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, విద్య, వైద్య సేవలు, కౌన్సెలింగ్, భద్రతా ఏర్పాట్లు మరియు ఇతర మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించి, అవసరమైన చోట తక్షణమే మెరుగుదల చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు.

రికార్డుల నిర్వహణ బాలల సంక్షేమానికి సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలన గృహం సూపరింటెండెంట్ శ్రీదేవి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్.రజినీ, పరిశీలక గృహ సిబ్బంది పాల్గొన్నారు.

# సోషల్ టీచర్ల సేవలు అభినందనీయం

- ఖిలా వరంగల్ మండల విద్యాధికారి వెంకటయ్య
- ఘనంగా సోషల్ టీచర్లకు సన్మానం




**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** బడుల నిర్వహణలో.. విద్యార్థుల జీవన నైపుణ్యాల పెంపులో.. సోషల్ టీచర్ల సేవలు అభినందనీయమని ఖిలా వరంగల్ మండల్ విద్యాశాఖ అధికారి వెంకటయ్య కొనియాడారు. వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సోషల్ కాంప్లెక్స్ మీటింగ్ ను ఆయన సందర్శించి శిక్షణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశంలో పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధి సాధించేలా కృషి చేయడంలో సోషల్ టీచర్ల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పూసారం, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ఉర్సు కాంప్లెక్స్ సోషల్ ఫోరం అధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, సెక్రటరీ ఎం. బిక్షపతి, కోశాధికారి రంగాచారి, ఉపాధ్యక్షులు చంద్రకళ, శోభారాణి ఆధ్వర్యంలో ఎంఈఓ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఉర్సు కాంప్లెక్స్ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో.. ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న వి వెంకటరెడ్డి, ఎం శారద, ఇటీవల ఏపీఎస్సీ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన భూపాల్ రెడ్డి, గులాబ్ సింగ్ లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఎస్ఎస్సి ఉత్తీర్ణత శాతంలో రెండవ స్థానాన్ని సాధించిన ప్రభుత్వ పాఠశాల కృష్ణ కాలనీకి చెందిన సోషల్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులైన సదాలక్ష్మి రాజేష్ లను ఎంఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ ఉట్కూరి అశోక్, ఆర్పీలు సిహెచ్. సంపత్, జే. సంపత్, రిటైర్డ్ ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, సమ్మయ్య, వరంగల్, ఖిలా వరంగల్ లోని సోషల్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, సీఆర్పీలు రాధాకృష్ణ, రమణిలుపాల్గొన్నారు.

# బంగారం, వజ్రాల కంటే ఖరీదైన విషం

### లీటరు ధర కోట్లలో...

**పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ :** ప్రపంచంలో బంగారం, వజ్రాలను అత్యంత ఖరీదైనవిగా భావిస్తాం. కానీ ఒక చిన్న జీవి విషం వీటన్నింటి కంటే కోట్ల రెట్లు ఎక్కువ విలువ చేస్తుందని మీకు తెలుసా? ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన జీవుల్లో ఒకటైన తేలు విషం మార్కెట్‌లో లీటరుకు కోట్ల రూపాయల ధర పలుకుతోంది. కింగ్ కోబ్రా విషం కంటే ఎంతో శక్తివంతమైన ఈ తేలు విషానికి అంతర్జాతీయంగా భారీ డిమాండ్ ఉంది. డెత్‌స్టాకర్ తేలు ప్రధానంగా ఉత్తర ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాలలోని ఎడారి ప్రాంతాల్లో కనిపిస్తుంది. దీని విషం రసాయన కూర్పు అత్యంత సంక్లిష్టమైనది. ఒక తేలు నుంచి ఒకేసారి సగటున కేవలం 0.006 మిల్లీలీటర్ల విషం మాత్రమే లభిస్తుంది. ఒక గ్యాలన్ విషాన్ని సేకరించాలంటే లక్షలాది తేళ్లను పట్టుకోవాల్సి ఉంటుంది. విషాన్ని సేకరించడం, దానిలోని సహజ గుణాలు చెడిపోకుండా భద్రపరచడం, ప్రయోగశాలల కోసం శుద్ధి చేయడం అత్యంత శ్రమతో కూడుకున్న ప్రక్రియ.

### విషాన్ని ఎలా తీస్తారు?

తేళ్ల నుంచి విషాన్ని సేకరించేందుకు శిక్షణ పొందిన నిపుణులు ప్రత్యేక పద్ధతులను ఉపయోగిస్తారు. తేలుకు ఎలాంటి హాని కలగకుండా, దాని తోక భాగానికి స్వల్ప స్థాయిలో విద్యుత్ షాక్ ఇస్తారు. దాంతో తేలు విషాన్ని విడుదల చేస్తుంది. ఈ విధానంలో సేకరించిన విషాన్ని ప్రోటీన్లు, పెప్టైడ్లు దెబ్బతినకుండా వెంటనే ల్యాబ్‌లకు తరలిస్తారు.

### వైద్య రంగంలో అద్భుత ఉపయోగాలు

డెత్‌స్టాకర్ విషానికి ఇంతటి విలువ ఉండటానికి కారణం వైద్య పరిశోధనల్లో దీనికి ఉన్న అద్భుత లక్షణాలే.

**మెదడు కణితి గుర్తింపు:** ఈ విషంలో ఉండే క్లోరోటాక్సిన్ అనే ప్రొటీన్ మెదడులోని క్యాన్సర్ కణాలను సులభంగా గుర్తించడానికి ఉపయోగపడుతుంది.

**కీలక ఔషధాల తయారీ:** క్యాన్సర్ చికిత్స, తీవ్రమైన నొప్పి నివారణ మందులు, సరికొత్త యాంటీబయాటిక్స్ మరియు ఆటో ఇమ్యూన్ వ్యాధుల మందుల తయారీలో ఈ విషాన్ని వాడుతున్నారు.

**సౌందర్య -వ్యవసాయ ఉత్పత్తులు:** కొన్ని రకాల కాస్మెటిక్స్, అధునాతన సహజ పురుగుమందుల తయారీలోనూ దీనిని ఉపయోగిస్తున్నారు.

### అత్యధిక ఉత్పత్తి ఎక్కడ జరుగుతుంది?

ఎండలు ఎక్కువగా ఉండే పొడి ఎడారి ప్రాంతాలైన ఈజిప్ట్, టర్కీ, ఇరాన్ వంటి దేశాలు తేలు విషం ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నాయి. రాళ్ల కింద నివసించే ఎడారి తేళ్ల విషంలో గాఢత, శక్తి అత్యధికంగా ఉంటాయి. అందుకే ఈ దేశాల్లో ప్రత్యేకంగా తేళ్ల పెంపక కేంద్రాలను ఏర్పాటు చేసి విషాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు.



# అర్హత ఉన్న ఒక్క ఓటరూ హక్కును కోల్పోవద్దు..

### ఎస్ఐఆర్‌పై ఈసీకి సీఎం రేవంత్ కీలక ప్రతిపాదనలు



**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియలో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు ూణణ జాబితాలోకి వెళ్లడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసిన ఆయన.. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తుది జాబితాలో చోటు కోల్పోకుండా ప్రక్రియను పారదర్శకంగా, అందరికీ అవకాశం కల్పించేలా నిర్వహించాలని సూచించారు. ూ×=లో తెలంగాణకు చెందిన 73.39 లక్షల ఓటర్ల ఎంట్రీలు ూణణ జాబితాలోకివెళ్లాయని సీఎం పేర్కొన్నారు. వీరిలో 45.19 లక్షల మందిని శాశ్వతంగా తరలిపోయినవారుగా గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని మొత్తంూణణ ఎంట్రీల్లో దాదాపు 58.6 శాతం హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉన్నాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా జారీ చేసిన వెరిఫికేషన్ నోటీసుల్లోనూ 41.9 శాతం ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నాయని తెలిపారు.

తాత్కాలికంగా ఇంట్లో లేని ఓటర్లను శాశ్వతంగా తరలిపోయినవారిగా పరిగణించకూడదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగం, విద్య, ఇతర కారణాలతో తాత్కాలికంగా మరో ప్రాంతంలో ఉన్నవారికి తగిన అవకాశం కల్పించాలని కోరారు. ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారికి కొత్త చిరునామాలో ఓటు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించాలని సూచించారు. షిఫ్టెడ్ కేటగిరీలో ఉన్న ఓటర్లకు కూడా తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబరు 16 వరకు ఉన్న క్లెయిమ్స్, అభ్యంతరాల గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని సీఎం కోరారు. సెప్టెంబరు 19న తుది జాబితా ప్రచురణకు బదులుగా అదనపు సమయం ఇవ్వాలని ప్రతిపాదించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు స్పందించేందుకు కనీసం 3--4 వారాల వ్యవధి ఉండాలని పేర్కొన్నారు.

గ్రామసభలు, వార్డు సభల్లో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను బహిరంగంగా చదివించాలని, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ఈసీకి సూచించారు. ూ×=లో అంగీకరించే పత్రాలపై తెలంగాణకు స్పష్టమైన, విస్తృత జాబితా ప్రకటించాలని కోరారు. మండల స్థాయిలో సులభంగా లభించే పత్రాలను కూడా అందులో చేర్చాలని సూచించారు. హైదరాబాద్‌లో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 78 వేల వరకు నోటీసు కేసులు ఉన్నాయని సీఎం వెల్లడించారు. జు=ా స్థాయిలో అదనపు అధికారులను నియమించి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తుది జాబితా నుంచి తొలగిపోకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



# కేదాశి సుదర్శన్ మృతి పట్ల పలువురి సంతాపం

వరంగల్, ఆగస్టు 29 (పీపుల్స్‌డైరీ) : వరంగల్ నగరంలో గల రంగసాయిపేట లోని కేదాసి సుదర్శన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. శనివారం పదవ రోజున వారి కేదాశి కుమారులు ప్రవీణ్ కుమార్ రాజేష్, టింకు సంతాప సభ ను నిర్వహించడం జరిగింది. ఈ సంతాప సభలో రంగసాయిపేట ఎసెస్సీ 1990-1991 హైస్కూల్ బ్యాచ్ విద్యార్థులు బూర సంతోష్ కుమార్, పూల మల్లికార్జున్, వనం రామకృష్ణ, కాకతీయ సేవా సమితి అధ్యక్షులు మండల నరసింహ రాములు, ఎర్ర సాంబయ్య, ధారబోయిన శ్రీను, అడుప రాజ్ కుమార్ , కోక సత్యనారాయణ మానుపాటి సాంబయ్య పుప్పాల సుధాకర్ దూడ రవి మైదం రాకేష్ ఆరెపెల్లి ఎల్లయ్య సుతారి సురేష్ కాకతీయ సేవా సమితి సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాప సభలో పలువురు సుదర్శన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో స్విమ్మర్ అధ్యక్షుడు శేర్ల. అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి తాడెం కుమార్ శంకేసి వెంకటేశ్వర్లు అడ్డగట్ల జ్ఞానేశ్వర్ మునుకుంట్ల రాములు కోరే రవి బొల్లికుంట రమేష్ విలాసాగరం శ్రీధర్ తదితరులు పాల్గొని సుదర్శన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు

# కేయూ క్యాంపస్ కళాశాలలో ఎంసిఏ స్పాట్ అడ్మిషన్లు

**పీపుల్స్‌డైరీ-హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కళాశాలలో 2026-2027 విద్యా సంవత్సరానికి గాను ఎం సి ఏ కోర్సులో ఈ నెల 31 నుండి సెప్టెంబర్ 3 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టి జి ఐ సెట్ 2026లో అర్హత సాధించిన అభ్యర్థులతో పాటు, అర్హత సాధించని అభ్యర్థులు కూడా స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు, అవసరమైన ఫీజును వెంట తీసుకురావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కాదని తెలిపారు.స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలు టి జి ఐ సెట్ అధికారిక వెబ్‌సైట్ ను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు కాకతీయ యూనివర్సిటీలోని క్యాంపస్ కళాశాలలో సంప్రదించాలన్నారు.

# హైదరాబాద్‌లో నైట్ బస్సు సర్వీసులు..

### టైం టేబుల్, రూట్ మ్యాప్ రిలీజ్ చేసిన గ్రేటర్ ఆర్టీసీ

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు గ్రేటర్ హైదరాబాద్ శుభవార్త చెబుతూ నైట్ షిఫ్ట్ స్పెషల్ బస్సు సర్వీసులు నడిపేందుకు రెడీ అయిన సంగతి తెలిసిందే. రాత్రి వేళల్లోనూ ముఖ్యమైన రూట్లలో ఈ బస్సు సర్వీసులు నడవనున్నాయి. రాత్రి సమయాల్లో ప్రజా రవాణాకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని గ్రేటర్ ఆర్టీసీ అధికారులు సెప్టెంబరు 1వ తేదీ నుంచి రాత్రి పూట సేవలను ప్రారంభిస్తున్నారు. ఆరు మార్గాల్లో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని గ్రేటర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఏవైనా సందేహాలుంటే 99592 26160 నంబరులో సంప్రదించొచ్చని ఆయన వెల్లడించారు.

### బస్సు సర్వీసులు నడిసే రూట్లు, టైం టేబుల్...

**కోఠి నుంచి పటాన్ చెరు (222A) :** ముషీరాబాద్, మియాపూర్-2 డిపోల నుంచి రెండు బస్సుల చొప్పున మొత్తం నాలుగు బస్సులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తాయి. అబిడ్స్, లక్డీకాపుల్, కేర్ హాస్పిటల్, అన్నపూర్ణ, ఉషాకిరణ్, గుట్టల బేగంపేట్, కొండాపూర్ క్రాస్‌రోడ్, హఫీజ్‌పేట, లింగంపల్లి, రామచంద్రాపురం, బీరంగూడ, పటాన్‌చెరు మార్గాల్లో సేవలు అందిస్తాయి. కోఠి నుంచి మొదటి బస్ రాత్రి 11.40 గంటలకు బయల్దేరుతుంది. చివరి బస్ తెల్లవారుజామున 4.30 గంటలకు ఉంటుంది. ప్రతి 45 నిమిషాలకు ఓ బస్ ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది.

**సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరు (219) :** కంటోన్మెంట్ డిపో-1, మియాపూర్-2 డిపో నుంచి -1 చొప్పున రెండు బస్సులు నడుస్తాయి. సికింద్రాబాద్ నుంచి మొదటి బస్ రాత్రి 11.20 గంటలకు, చివరి బస్ తెల్లవారుజామున 3 గంటలకు బయల్దేరుతుంది. ప్రతి గంట 10 నిమిషాలకు ఒక బస్సు సర్వీసు ఉంటుంది. పటాన్‌చెరు నుంచి మొదటి బస్ రాత్రి 11.25 గంటలకు, చివరి బస్ తెల్లవారుజామున 3 గంటలకు ప్రతి 1 గంట 15 నిమిషాలకు అందుబాటులో ఉంటుంది. ప్యారడైజ్, తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, బాలానగర్ క్రాస్‌రోడ్, ఐడీపీఎల్, ప్రశాంత్ నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, హైదర్ నగర్, గంగారం, లింగంపల్లి రామచంద్రాపురం మీదుగా ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయి.

**అఫ్జల్‌గంజ్ నుంచి పటాన్‌చెరు (218) :** సీబీఎస్, కోఠి, లక్డీకాపుల్, ఎస్.ఆర్.నగర్, వై.జంక్షన్, కేపీహెచ్‌బీ, మియాపూర్, లింగంపల్లి, రామచంద్రాపురం మీదుగా ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. మట్నత్తం 2 బస్సులు అందుబాటులో ఉంటాయి. అఫ్జల్‌గంజ్ నుంచి మొదటి బస్ రాత్రి 11.25 గంటలకు, చివరి బస్ తెల్లవారుజామున 3.05 గంటలకు ప్రతి 1.10 గంటలకు ఒకటి చొప్పున ఉంటుంది. పటాన్‌చెరు నుంచి మొదటి బస్ రాత్రి 11.20 గంటలకు, చివరి బస్ తెల్లవారుజామున 3.15 గంటలకు ప్రతి 1.15 గం.లకు ఒకటి చొప్పున అందుబాటులో ఉంటుంది.

**హయత్‌నగర్ నుంచి సికింద్రాబాద్ (290 U) :** ఈ రూట్‌లో మట్నత్తం 3 బస్సులు రాకపోకలు సాగిస్తాయి. హయత్‌నగర్ నుంచి మొదటి బస్ రాత్రి 11.20కి, చివరి బస్ తెల్లవారుజామున 3 గంటలకు ప్రతి గంట 15 నిమిషాలకు ఒకటి చొప్పున ఉంటాయి. సికింద్రాబాద్ నుంచి మొదటి బస్ రాత్రి 11.25 గం.లకు, చివరి బస్ తెల్లవారుజామున 3గం.లకు ప్రతి గంట 15 నిముషాలకు ఒకటి చొప్పున రాకపకోలు సాగిస్తాయి. భాగ్యలత, పనామా, ఎల్బీనగర్, అల్కాపురి, నాగోల్, నాగోల్ మెట్రో స్టేషన్, సర్వే ఆఫ్ ఇండియా, ఎన్‌జీఆర్‌ఐ, తార్నాక, ఆలుగడ్డ బావి, రేతి ఫైల్, సికింద్రాబాద్ ఆల్ఫా, జేబీఎస్ మీదుగా ఈ బస్సులు నడుస్తాయి.

**బాచుపల్లి నుంచి వేవ్‌రాక్ (195W) :** ఈ రూట్‌లో మట్నత్తం 3 బస్సులు రాకపోకలు సాగిస్తాయి. నిజాంపేట్, నిజాంపేట్ క్రాస్‌రోడ్, జేఎన్‌టీయూ, హైటెక్ సిటీ, ఈఎస్ఐసీ, ఇందిరా నగర్, ఇన్ఫోసిస్, ఇన్ఫోటెక్ మీదుగా నడుస్తాయి. బాచుపల్లి నుంచి మొదటి బస్ రాత్రి 9.15 గం.లకు, చివరి బస్ తెల్లవారుజామున 3.10గం.లకు ప్రతి 40 నిమిషాలకు ఒకటి చొప్పున ఉంటాయి. వేవ్ రాక్ నుంచి మొదటి బస్ రాత్రి 10.25 గం.లకు, చివరి బస్ తెల్లవారుజామున 4.25గం.లకు ప్రతి 40 నిమిషాలకు ఒకటి చొప్పున రాకపోకలు సాగిస్తాయి.

**కొండాపూర్ నుంచి సికింద్రాబాద్ (10H) :** ఈ రూట్‌లో మట్నత్తం 2 బస్సులు రాకపోకలు సాగిస్తాయి. కొండాపూర్ నుంచి మొదటి బస్ రాత్రి 10.55 గం.లకు, చివరి బస్ తెల్లవారుజామున 3.40 గం.లకు ప్రతి 50 నిమిషాలకు ఒకటి చొప్పున రాకపోకలు సాగిస్తాయి. సికింద్రాబాద్ నుంచి మొదటి బస్ రాత్రి 10.50 గం.లకు, చివరి బస్ తెల్లవారుజామున 3.40గం.లకు ప్రతి 50 నిమిషాలకు ఒకటి చొప్పున రాకపోకలు సాగిస్తాయి. ప్లాజా, పోలీస్ లైన్స్, ఆర్.జె.కాలేజ్, స్టేట్ హోమ్, ఉషాకిరణ్, సైబర్ టవర్స్ మీదుగా ఈ బస్సులు నడుస్తాయి.

# పర్యవేక్షణతో అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

## రూ. 95.50 లక్షల సుడా నిధులతో రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



**ఖమ్మం, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో రూ. 95.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ... ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి, పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో గ్రావెల్ దందా..!

## సర్వే నం.49లో అక్రమ తవ్వకాలపై బీఆర్ఎస్ ఫిర్యాదు



**మణుగూరు ఆగష్టు 29 (పీపుల్స్ డైరీ) :** మణుగూరు: గుట్ట మల్లారం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 49లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారని మాజీ జడ్పీటీసీ పోశం నరసింహారావు ఆరోపించారు. గత ప్రభుత్వం గిరిజన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కేటాయించిన భూమిలోనే తవ్వకాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన భూమిలో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు, తరలింపులు జరుగుతున్నాయా అనే అంశంపై రెవెన్యూ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మణుగూరు రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు డీటీ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిలో తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎవరు అనుమతులు ఇచ్చారు. తవ్విన గ్రావెల్‌ను ఎక్కడికి తరలిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేసి, ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నరసింహారావు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ప్రజలు, పార్టీ నాయకులతో కలిసి ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

# చెన్నూర్‌లో నార్కోటిక్ డాగ్ టీంతో తనిఖీలు



**చెన్నూర్, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** గంజాయి అక్రమ వినియోగం, విక్రయాల నియంత్రణలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం, చెన్నూర్ పట్టణంలో నార్కోటిక్ డాగ్ టీంతో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. గాంధీ చౌక్ నుంచి ఉత్తర వాహిని రోడ్డు వరకు షాపులు, హోటళ్లు, పాన్ షాపులతో పాటు అనుమానితుల ఇళ్లలోనూ తనిఖీలు చేపట్టారు. చెన్నూర్ పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐ శ్యామ్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో గంజాయి సేవిస్తున్నారనే అనుమానం ఉన్న ఇద్దరు యువకులను వైద్య పరీక్షల నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గంజాయి సేవించే, విక్రయించే, సరఫరా చేసే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పోలీసు లు తెలిపారు. గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే ప్రజ లు డయల్ 112 ద్వారా లేదా నేరుగా పోలీసులకు తెలియజేయా లని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. గంజాయి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# బీజేపీని గద్దె దించడంతోనే దేశానికి రక్ష

## సెప్టెంబర్ ఒకటిన ఢిల్లీలో మహా ర్యాలీ - సిపిఐ నేత బాగం




**ఖమ్మం, ఆగష్టు 29 (పీపుల్స్ డైరీ) :** బిజెపిని గద్దె దించడం ద్వారా మాత్రమే ఈ దేశానికి భవిష్యత్తు ఉంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు దేశ ప్రజలను కులం, మతం పేర దేశ ప్రజలను విభజించి లబ్ది పొందాలని చూస్తుందని ఆయన ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ బిజెపి పాలనలో ఆర్థిక వ్యవస్థ కుదేలైందని ఆర్థిక అంతరాలు పెరిగిపోయి పేదలు మరింత పేదలు అవుతున్నారన్నారు. నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అన్న బిజెపి ప్రచారంలో వాస్తవం లేదని దేశ సంపద అది కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతుందన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# సత్యానంద్‌కు టిడబ్ల్యూజేఎఫ్ ఘన నివాళి..



**ఖమ్మం, ఆగష్టు 29 (పీపుల్స్ డైరీ) :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడే అమర జర్నలిస్టు సత్యానంద్ సేవలు శ్లాఘనీయమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, రాష్ట్ర కమిటీ కౌన్సిల్ సభ్యులు నాగేందర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు సంతోష చక్రవర్తి లు అన్నారు. జర్నలిస్టుల ఇండ్ల సాధన కోసం టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాదయాత్ర శనివారం మధిర నియోజకవర్గంలో ఎల్ గోవిందాపురంలో గల అమర జర్నలిస్టు మందా సత్యానంద్ నివాసానికి చేరుకుంది. ఫెడరేషన్ బృందం వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... యువ జర్నలిస్ట్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, ఆయన లేని లోటు వారి కుటుంబానికి, జర్నలిస్ట్ సమాజానికి తీరని లోటు అని వారన్నారు. పసితనం వీడని చిన్నారుల చదువుల బాధ్యతను తమ యూనియన్ బుజస్కంధాలపై వేసుకుందని భవిష్యత్తులో వివిధ సంఘాల సహకారంతో ఆ కుటుంబానికి చేయూతను అందిస్తామని వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల బాధ్యులు, జర్నలిస్టు జిల్లా నగర ప్రెస్ క్లబ్ కమిటీల బాధ్యులు వీడియో జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



**నర్సంపేట, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పిలుపు మేరకు బీజేవై ఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్ ఆధ్వర్యంలో చేపడుతున్న "ఫీజు బకాయి -- బీజేపీ లడాయి" పోరాటానికి ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 15వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో ఫీజు బకాయిలు పేరుకుపోయి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగుతోందని విమర్శించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతో కీలకమని, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీల యాజమాన్యాలువిద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి తెస్తున్నాయని తెలిపారు. ఫలితంగా విద్యార్థులు తమ చదువులను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమం లో వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవి కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా,జిల్లా నాయకులు,రాష్ట్ర నాయకులు,వివిధ మోర్చాల నాయకులు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన



**ఖమ్మం, ఆగష్టు 29 (పీపుల్స్ డైరీ) :** మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి-- ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి అని ఇన్స్పెక్టర్ భానుప్రకాష్ విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే తీవ్ర ప్రభావాలు, భవిష్యత్ జీవితంపై కలిగే దుష్పరిణామాలపై పలు పాఠశాలల విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన కల్పించే ఉద్దేశంతో పాండురంగపురం, బల్లెపల్లి గ్రామంలోని పలు పాఠశాలలో ఖానాపురం హవెలి పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులకు సురక్షితమైన, మాదక ద్రవ్యాల రహిత వాతావరణాన్ని కల్పించడంతో పాటు, మాదక ద్రవ్యాలపై స్థానిక సమాజంలో అప్రమత్తతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ తో పాఠశాల పరిసర ప్రాంతాలలో, ప్రాంగణానికి సమీపంలోని దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, చట్టవిరుద్ధమైన మాదక ద్రవ్యాల ఆనవాళ్లను గుర్తించేలా తనిఖీలు చేపట్టారు.

# మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి



**కరకగూడెం, ఆగష్టు 29(పీపుల్స్ డైరీ) :** కరకగూడెం మండల కేంద్రం లో శనివారం సెర్ప్ "స్వయం శక్తి మండల మహిళా సమాఖ్య "కరకగూడెం కార్యాలయం లో జరిగిన వీఓ ఏ ల సమీక్ష సమావేశం జరిగింది, ఈ సమీక్ష సమావేశం లో మండలం లోని అన్ని సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి, దాని కొరకు, "నిత్యం సరైన సమయం లో సమావేశం లు నిర్వహించడం, ఆర్థిక లావాదేవీలు ఆన్లైన్లో పొందుపరచడం తీసుకున్న రుణాలు సకాలం లో చెల్లిపులు చేయుట, తిరిగి కొత్త రుణాలు తీసుకొని నూతన వ్యాపారాలు, జీవనోపాధులు పెంచుకునుట తద్వారా అదనపు ఆదాయం ఆర్జించి కుటుంబాలు ఆర్థికంగా సుస్థిరత కు చేరుకోవాలి అని ఆ విధంగా వీఓ ఏ లు గ్రామాల్లో పని చేయాలని సంస్థాగత నిర్మాణం, మానవభివృద్ధి విభాగం, వయోజన విద్య సురేష్ రెడ్డీ, వ్యవసాయం,బ్యాంకు లింకేజీ విభాగం సమ్మక్క ఆసరా పెన్షన్‌లు, సదరం విభాగం నర్మదా రెడ్డీ లు సమీక్షించారు. ఈ విభాగాలలో గ్రామాల్లో అభివృద్ధి చేసే విధంగా పని చేయాలని వీవో ఏ లకు లక్ష్యాలు నిర్దేశం చేసారు. సమావేశంలో ఎపిఎం వినోద్ క్రాంతి, మండల సమాఖ్య అధ్యక్షులు సరస్వతి సీసీ సత్యనారాయణ, వీఓ ఏ లు పాల్గొన్నారు ఎపిఎం వినోద్ క్రాంతి, మండల సమాఖ్య అధ్యక్షులు సరస్వతి సీసీ సత్యనారాయణ, వీవోఏలు పాల్గొన్నారు.

# తుమ్మలచెరువుకు గోదారి జలాలు!



**పినపాక, ఆగష్టు 29(పీపుల్స్ డైరీ) :** అశ్వాపురం మండలంలో గల తుమ్మలచెరువుకు గోదావరి నీరు లిఫ్ట్ ద్వారా ఏర్పాటు చేయాలని ఆనాడు అధికార తెలుగుదేశం పార్టీ లో మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడల్లా కొల్లు మల్లారెడ్డి ఆధ్వర్యంలో రైతులు వారిని కోరేవారు. సీతారామ ప్రాజెక్టుకు తుమ్మల నాగేశ్వరరావు శ్రీకారం చుట్టిన తర్వాత తుమ్మలచెరువుకు నీరు అందించాలనే సంకల్పంతో మొదటి టీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు తుమ్మలచెరువుతో పాటు అశ్వాపురం మండలాన్ని సస్యశ్యామలం చేయాలని ఉద్దేశంతో మారెళ్ళ పాడు ప్రాజెక్టు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశిం చి అంచనాలు తయారు చేయించినారు. రెండో సారి టిఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ ప్రతిపాదనలు మంజూరి చేయగా అప్పటి ప్రభుత్వ విప్ రేగా కాంతా రావు ఈ ప్రాజెక్టు శంకుస్థాపన చేసినారు కానీ తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వం పోగానే ఈ ప్రాజెక్టు మూలన పడుతుంది ఏమో అని రైతులు నిరాశ చెందినా రు కానీ అదృష్టవశాత్తు రైతు పక్షపాతి అయిన తుమ్మల నాగేశ్వరరావు మంత్రి కావడం వల్ల ఒకటికి పది సార్లు ప్రాజెక్టును సందర్శించి అధికారులను పరుగులు పెట్టించి పనులు పూర్తి చేయించినారు. ఒక దశలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యేవరకు నిరంతరం పరిశీలించమని ఆగస్టు నెల చివరికి తుమ్మలచెరువుకు నీళ్లు ఇచ్చి తీరాలని ఎమ్మెల్యే గారిని ఆదేశించగా దాదాపు 20 రోజుల నుండి రాత్రి పగలు అక్కడే ఉండి పనులు పూర్తి చేయించినారు ఏది ఏమైనా దశాబ్దాల కల నెరవేరినందుకు తుమ్మలచెరువు ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

# మహనీయుల సేవలు అభినందనీయం



**ఏన్కూరు, ఆగష్టు 29 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏన్కూర్ నందు శనివారం గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలతో అలంకరణ చేసి స్మృత్యాంజలులు అర్పించారు. ఆ తర్వాత కళాశాల ప్రధానాచార్యులు మీట కోటి సింహాచలం స్వయంగా విద్యార్థులందరికీ 2000 రూపాయలు విలువైన తెలుగు కాపీ పుస్తకాలను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గతంలో ఉచిత పుస్తకాలు మరియు ఉచిత నోట్ బుక్స్ ఇవ్వడం జరిగింది ఈరోజు జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇస్తున్న వెల్కమ్ కిట్‌లో భాగంగా శనివారం ఉచిత కాలేజీ బ్యాగుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాచార్యులు మీటకోటి సింహాచలం మాట్లాడుతూ తెలుగు బాష ఔన్నత్యం, వ్యవహారిక భాషోద్యమ నాయకుడిగా,సవర భాషా స్థాపకుడిగా రామమూర్థి సేవలను కొనియాడారు. అదేవిధంగా మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడల ద్వారా విద్యార్థులు మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించు కోవచ్చని సూచించారు. ఈసందర్భంగా కళాశాల తెలుగు ఉపన్యాసకురాలు బి రమాదేవి నీ, రసాయన శాస్త్ర అధ్యాపకులు స్పోర్ట్స్ ఇంచార్జ్ జి. కృష్ణ ప్రసాద్‌ని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన ఆచార్యులు మీటకోటి సింహాచలం, అధ్యాపకులు సుందర్, కృష్ణ ప్రసాద్, బాబూలాల్, రామారావు, వెంకటేశ్వరావు, విజయలక్ష్మి, నరసింహారావు, రమాదేవి, కిషోర్ బాబు, రాజన్న, సాంబశివరావు, నవీన్ కుమార్, కవిత బోధనేతర సిబ్బంది నందకిషోర్, లావణ్య, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు

# జిల్లా స్థాయి క్రీడా పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న ఖమ్మం జిల్లా క్రీడాకారులు



**ఏన్కూరు, ఆగస్టు 29 (పీపుల్స్ డైరీ) :** ఐటిడిఏ భద్రాచలంలో జరుగుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి గిరిజన ఉద్యోగులు ఉపాధ్యాయులు ఖమ్మం జిల్లా నుండి 29,30 తారీఖులో జరుగుతున్నాయి. వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాట్మెంటను ఉమెన్ చెస్, క్యారమ్స్, టెన్నికాయిడ్ పోటీలలో ఖమ్మం జిల్లా క్రీడాకారులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.ఖమ్మం జిల్లా క్రీడాకారులతో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ గ్రూప్ ఫోటో దిగి ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్న ఉపాధ్యాయులను, ఉద్యోగులను అభినందించారు. ఉపాధ్యాయులు క్రీడా స్ఫూర్తితో ఈ రెండు రోజులు చక్కగా పాల్గొ నాలన్నారు.ఈ పోటీలు పాల్వంచ కిన్నెరసాని స్పోర్ట్స్ క్రీడా మైదానంలో జరిగాయి.ఈ పోటీలో ఖమ్మం జిల్లా నుండి ఏసీఎంఓ ఎల్.రాములు, పీడీలు ఎన్.శంకర్రావు, బి.సక్రాం, జె.రామారావు, సుస్మిత, సతీష్,క్రీడాకారుల డిఎస్. నాగేశ్వరరావు, బి. రాందాస్, రమేష్, నామాల శ్రీనివాస్,జె. శ్రీనివాస్,జి.భారతి, అశ్విని, ఎం శివ, ఏ.సేన, జి.నాగేశ్వరరావు మోహన్, కిషన్, కృష్ణ, వీరన్న, జె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com